మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 4-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 67 Issue: 67

04 సెప్టెంబర్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:06 సూర్యాస్తమయం - సా. 6:24 తిథి అష్టమి రా. 12:12ం వరకు తరువాత నవమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం రోహిణి రా. 11:01 వరకు తరువాత మృగశిర యోగం హర్షణ మ. 3:38 వరకు కరణం భాలవ మ. 1:19 వరకు కౌలవ రా. 12:12ం వరకు వర్జ్యం మ. 3:32 నుండి సా. 5:02 వరకు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:23 వరకు మ. 12:39 నుండి మ. 1:28 వరకు రాహుకాలం ఉ. 10:42 నుండి మ. 12:15 వరకు యమగండం మ. 3:19 నుండి సా. 4:51 వరకు గుళికాకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:10 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:30 నుండి తె. 5:18 వరకు అమృత ఘడియలు రా. 8:02 నుండి రా. 9:32 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:50 నుండి మ. 12:39 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. టీడీపీ రక్తం ఉన్నోళ్లే ఇలాంటి కుట్ర రాజకీయాలు చేస్తారని సీఎంపై ఆమె మండిపడ్డారు. మళ్లీ తనే సీఎం అవుతాననడం.. ఎమ్మెల్యే టికెట్లను సొంతంగా రేవంత్ ప్రకటించడం సరికాదని సురేఖ ఫైరయ్యారు.

## టీడీపీ బ్లడ్ బ్లాక్‌మెయిల్

### నా బర్తరఫ్ కోసం అధిష్ఠానానికే బెదిరింపులు

### పొంగులేటి, వేం తదితరుల కుట్రలు

### కొండా సురేఖ సంచలన ఆరోపణలు

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): యాదాద్రి పాలకమండలిపై ఎవరి దగ్గరా చర్చించకుండా కమిటీ వేస్తే గొడవలు అయ్యాయని పేర్కొన్న ఆమె.. మంత్రులు, ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డి పాలనతో సంతోషంగా ఉన్నారా? అంటే లేరని తనకు తెలుసునని మీడియాకు తెలిపారామె. ఈరోజు నాకు అన్యాయం జరిగింది, రేపు మీకూ జరుగుతుంది.. ఇప్పటికైనా బయటికి వచ్చి మాట్లాడండి అని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని తెలిపిన సురేఖ ప్రభుత్వ వ్యతిరేకతపై సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. తాను పార్టీనిగానీ, సీఎంనుగానీ ఎక్కడా విమర్శించలేదని చెప్పిన ఆమె అయినా సరే తనకు షోకాజ్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. కనీసం అధిష్ఠానానికి వివరణ ఇచ్చే అవకాశం కూడా ఇవ్వకుండా అన్యాయంగా తనను బర్తరఫ్ చేశారని సురేఖ ఆవేదనకు లోనయ్యారు. తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం

తరువాయి 2 వ పేజీలో...

# బీసీ బిడ్డ బర్తరఫ్

## మంత్రివర్గం నుంచి కొండా సురేఖకు ఉద్వాసన

### వేటు వేస్తూ రేవంత్ నిర్ణయం.. గవర్నర్ ఆమోదం.. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డిపైనా వేటు



బీసీ బిడ్డ, రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంత్రిమండలి నుంచి బర్తరఫ్‌కు గురయ్యారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి సైతం ఉద్వాసనకు గురయ్యారు. తక్షణమే వీరిద్దరిని ఆయా పదవుల నుంచి తొలగించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నట్టు గురువారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. కొండా సురేఖకు ఉద్వాసన పలకాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్‌కు సీఎం రేవంత్ సిఫారసు చేశారని తెలిపింది. అయితే దీనిపై లోక్‌భవన్ గురువారం రాత్రి 8 గంటల వరకు ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించకపోవడంతో ఉత్కంఠ కొనసాగింది.

### అదే సమయంలో ముగ్గురు బీసీ మహిళలకు కీలక పదవులు

### చిన్నారెడ్డి స్థానంలో గద్వాల్ విజయలక్ష్మి నియామకం

### మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా నేరెళ్ల శారద

### 'కుడా' చైర్ పర్సన్‌గా గుండు సుధారాణికి అవకాశం

#### వ్యూహాత్మకంగా మున్నూరుకాపు, పద్మశాలి, గౌడ కులస్తులకు పదవులు



హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): కానీ సీఎం.. మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి రాత్రి 8 గంటల ప్రాంతంలో లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో భేటీ అయ్యారు. ఆ వెంటనే లోక్‌భవన్ నుంచి బులెటిన్ జారీ అయింది. సీఎం రేవంత్ సలహా మేరకు కొండా సురేఖను మంత్రిమండలి నుంచి తొలగిస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నట్టు బులెటిన్ వెల్లడించింది.

**పరకాలలో మొదలైన చిచ్చు**

ఉమ్మడి వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గం నుంచి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రేవూరు ప్రకాశ్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 16న పరకాలలో జరిగిన బహిరంగ సభలో పిలుపునిచ్చారు. దీనిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఆగస్టు 19న కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సీఎంపై విరుచుకుపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బులు తీసుకుని వనపర్తి టికెట్‌ను ఇచ్చారని జి.చిన్నారెడ్డి సైతం వ్యాఖ్యానించడంతో కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేగింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన పార్టీ క్రమశిక్షణ కమిటీ వీరిద్దరికి ఉద్వాసన పలకాలని సిఫారసు చేస్తూ అధిష్ఠానానికి నివేదిక సమర్పించింది. ఈ పర్యావసానాల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లడం, ఏఐసీసీ చీఫ్ ఖర్గే సహా కొందరు పెద్దల్ని కలవడంతో సురేఖతో పాటు చిన్నారెడ్డిపై తరువాయి 2 వ పేజీలో...



# ధమ్కీ ఇస్తే భయపడ!

## బెదిరింపులకు లొంగేటోన్ని కాదు

### ఎవరైనా ప్రేమతోనే గెలవాలి.. ఒత్తిళ్లకు నేను తలవంచను

### సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ.. చంచల్‌గూడ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభం

తనను ఎవరూ ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరని సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవులు, బెదిరింపులకు తాను లొంగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తనను ప్రేమతో మాత్రమే గెలవగలరని, ఒత్తిళ్లకు తలవంచనని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హైదరాబాద్ అభివృద్ధి, మెట్రో విస్తరణ, మౌలిక వసతులు, పేదల సంక్షేమంపై సీఎం పలు కీలక ప్రకటనలు చేశారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): గత ప్రభుత్వం కేవలం కొబ్బరికాయ కొట్టి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసిందని తెలిపారు. పాతబస్తీపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను గతంలోనే చెప్పినట్లు ఇది ఓల్డ్ సిటీ కాదని.. 'ఒరిజినల్ సిటీ' అని అన్నారు. ఇక్కడి ప్రతి గల్లీ తనకు తెలుసని పేర్కొన్నారు. అసదుద్దీన్ ఓవైసీ కోరిన అభివృద్ధి పనులను మంజూరు చేయాలని అధికారులను ఈ వేదికగా ఆదేశిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అబ్దుల్లా బలాలా.. కళాశాల అభివృద్ధికి తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,535 |
| వెండి (కిలో): | రూ.2,55,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,379 |

# పసిఫిక్ మరుగుతోంది!

## మహాసముద్రంలో అసాధారణ వేడి

### 2027 ఫిబ్రవరి వరకు ఎల్‌నినో. ఉష్ణోగ్రతలు మరింత పెరిగే చాన్స్

### భారత్‌లో ఇప్పటికే 16 శాతం వర్షపాతం లోటు

### వ్యవసాయం, నీటి వనరులపై తీవ్ర ఒత్తిడి



వాతావరణ మార్పులపై 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యూఎంఓ) కీలక హెచ్చరిక చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం వేగంగా బలపడుతోందని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఇది చాలా తీవ్ర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు.. ఎల్‌నినో ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు 100 శాతం అవకాశం ఉందని తాజా అంచనాలో వెల్లడించింది.

న్యూఢిల్లీ: సెప్టెంబర్ 3న విడుదల చేసిన తాజా నివేదికలో డబ్ల్యూఎంవో ఇంతటి అధిక స్థాయి విశ్వాసంతో ఎల్‌నినో కొనసాగింపుపై అంచనా వేయడం ఇదే తొలిసారి. పసిఫిక్ సముద్ర ఉపరితలంతో పాటు లోతైన జలాల్లోనూ అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి ఎల్‌నినో మరింత బలపడేందుకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఎల్‌నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ తరువాయి 2 వ పేజీలో...



# నీళ్లివ్వకపోతే పాదయాత్ర చేస్తా

### సాగర్ నీటి షెడ్యూల్ ప్రకటించాల్సిందే.. లేదంటే కోదాడ-హాలియా పాదయాత్ర: కేటీఆర్

మిర్యాలగూడ, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద సెప్టెంబర్ 14న వినాయకచవితిలోపు నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేస్తానని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. మిర్యాలగూడలో గురువారం సాయంత్రం నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎన్నితడులకు నీళ్లు ఇస్తారు.. ఎప్పుడెప్పుడు ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సాగర్‌లో నీళ్లున్నా మంత్రులకు సోయి లేదని విమర్శించారు. శ్రీశైలంలో తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



శరీరంలో సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు ఎక్కడికి వెళ్తున్నాయో ప్రత్యక్షంగా గుర్తించే కొత్త చిత్రీకరణ సాంకేతికతను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ప్రత్యేక కాంతిని విడుదల చేసే సూక్ష్మ ప్లాస్టిక్ కణాల ద్వారా అవి శరీరంలోని కణజాలాల్లోకి ఎలా ప్రవేశిస్తున్నాయి, ఎక్కడ పేరుకుపోతున్నాయి, ఎలా బయటకు వెళ్తున్నాయో పరిశీలించవచ్చు. ఎలుకలపై నిర్వహించిన ప్రయోగాల్లో ఆహారం ద్వారా తీసుకున్న సూక్ష్మ ప్లాస్టిక్ కణాల కదలికలను 48 గంటల వరకు ట్రాక్ చేశారు. దీర్ఘకాలికంగా సూక్ష్మ ప్లాస్టిక్ ప్రభావం అవయవాలపై ఎలా ఉంటుందో, అవి వ్యాధులకు కారణమవుతున్నాయా అనే అంశాలపై భవిష్యత్ పరిశోధనలకు ఈ సాంకేతికత ఉపయోగపడనుంది.

# సీజేపీలో రెబల్స్

## కొత్తగా సీజేపీ-డీ ఏర్పాటు

జంతర్‌మంతర్ వద్ద జెన్ జెడ్ నిరసనలతో దేశవ్యాప్తంగా ప్రచారం పొందిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)లో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో రెబల్ వర్గం పుట్టుకొచ్చింది. కాక్రోచ్ జనతా పార్టీ-డెమోక్రటిక్ (సీజేపీ-డీ) పేరుతో కొత్త వర్గం ఏర్పాటైంది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేతో పాటు జంతర్‌మంతర్ వద్ద నిరసన సందర్భంగా ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రిలో చేరిన మనీష్ బ్రహ్మభట్ ఈ రెబల్ వర్గాన్ని ఏర్పాటు చేశారు.




న్యూఢిల్లీ: గురువారం ఢిల్లీలో 'సీజేపీ-డీ' ఏర్పాటు సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఈ రోజు కాక్రోచ్ జనతా పార్టీ-డెమోక్రటిక్ (సీజేపీ-డీ)ని మేం ప్రారంభిస్తున్నాం' అని ఆయన ప్రకటించారు. ప్రజల రక్తం, చెమటతో నిర్మితమైన ఉద్యమం నుంచి ఉద్భవించిన అసలు 'కాక్రోచ్ జనతా పార్టీ' బృందం, తదనంతరం కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ కోసం ప్రత్యేకంగా తరువాయి 2 వ పేజీలో...



# ర్యాష్ డ్రైవింగ్‌కు లైసెన్స్ పాయింట్లు కట్

### కొత్త వ్యవస్థను తీసుకొచ్చే యోచనలో కేంద్రం

న్యూఢిల్లీ: డ్రైవింగ్ చేసే వారికి కేంద్రం కీలక మార్పులు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి లైసెన్స్‌పై పాయింట్లు తగ్గించే విధానం తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. నిబంధనలు పదేపదే ఉల్లంఘిస్తే లైసెన్స్ సస్పెండ్ లేదా రద్దు చేసే అవకాశం ఉంటుంది. అదే సమయంలో సురక్షితంగా వాహనం నడిపే వారికి 'గుడ్ పాయింట్లు' ఇచ్చి ప్రోత్సాహకాలు అందించనున్నారు. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం 66వ సియామ్ వార్షిక సమావేశంలో ఈ విషయాలు తరువాయి 2 వ పేజీలో...

# వాట్సాప్‌లోనే కరెంట్, గ్యాస్ బిల్లుల చెల్లింపు

## 22,000కు పైగా బిల్లర్లకు పేమెంట్



న్యూఢిల్లీ: ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్, తన చెల్లింపుల సేవలను మరింత విస్తరించింది. భారత్‌లోని వినియోగదారుల కోసం సరికొత్త 'బిల్ పేమెంట్స్' ఫీచర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ కరెంట్, గ్యాస్, నీళ్లు, ఫాస్టాగ్, క్రెడిట్ కార్డ్, లోన్ వాయిదాల వంటి అన్ని రకాల బిల్లులను నేరుగా వాట్సాప్ యాప్ లోనే చెల్లించవచ్చు. ఈ సేవలను 'భారత్ బిల్‌పే సిస్టమ్' (బీబీపీఎస్) నెట్‌వర్క్ ఆధారంగా అందిస్తున్నారు. ఈ కొత్త ఫీచర్‌ను దశలవారీగా వినియోగదారులకు అందుబాటులోకి తెస్తున్నామని, రాబోయే కొద్ది వారాల్లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లందరికీ -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

4.9.2026

**మేషం:** చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. చిన్ననాటి మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు లభిస్తాయి. నిరుద్యోగులు నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. ఉద్యోగులకు జీతాల విషయంలో శుభవార్తలు అందుతాయి.

**వృషభం:** వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుకుంటారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. ఉద్యోగాలలో అధికారులు అనుగ్రహంతో సమస్యల నుండి బయటపడతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. బంధుమిత్రులతో శుభకార్యాలకు హాజరవుతారు. రాజకీయ ప్రముఖుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**మిధునం:** బంధుమిత్రులతో మాటపట్టింపులు తప్పవు. చేపట్టిన పనులు నెమ్మదిగా సాగుతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. వృత్తి వ్యాపారాలలో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి.

**కర్కాటకం:** ప్రయాణాల్లో మార్గ అవరోధాలు తప్పవు. ఋణదాతల నుండి ఒత్తిడి అధికమవుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. కొందరి ప్రవర్తన వలన మానసిక చికాకులు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహ పరుస్తాయి. ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి. శ్రమతో కానీ పనులు పూర్తి కావు.

**సింహం:** ఆప్తుల నుంచి వివాదాలకు సంబంధించి కీలక సమాచారం అందుతుంది. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. మిత్రులతో విందువినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన పనుల్లో కార్యసిద్ధి కలుగుతుంది.

**కన్య:** ముఖ్యమైన నిర్ణయాలలో మార్పులు చేస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడి తప్పదు. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. ఇంటాబయట పని ఒత్తిడి అధికమై సమయానికి నిద్రాహారాలు ఉండవు.

**తుల:** సమాజంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. అనుకున్న వ్యవహారాలు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. విలువైన వస్తు వాహన లాభాలు పొందుతారు. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు అధికమౌతాయి. కీలక సమయంలో ఆప్తుల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి.

**వృశ్చికం:** చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు తప్పవు. సోదరులతో స్థిరాస్థి వివాదాలు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. ఉద్యోగాలలో రావలసిన అవకాశములు చివరి నిమిషంలో చేజారుతాయి. బంధువులతో అకారణ విభేదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు.

**ధనస్సు:** ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. నూతన పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు మరింత లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారమున ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు.

**మకరం:** ఇంటాబయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. మిత్రుల నుంచి కీలక సమాచారం సేకరిస్తారు. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. బంధు మిత్రుల నుండి విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు.

**కుంభం:** ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. దైవ చింతన పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది.

**మీనం:** ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహ పరుస్తుంది. బంధుమిత్రులు కొన్ని విషయాలను మీతో విభేదిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత తప్పదు. కుటుంబ వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయటం మంచిది కాదు.

# టీడీపీ బ్లడ్ బ్లాక్‌మెయిల్

**మొదటి పేజీ తరువాయి**

చేశారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కుట్ర చేశారని సురేఖ ఆరోపించారు. అయితే తదుపరి కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాను తప్పు చేశాననే భావన లేదన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన మాటలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. సుస్మిత స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఆమె అభిప్రాయాలను తాము ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము మాట్లాడించలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని చాలామంది విమర్శిస్తున్నా.. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో సీఎం ఆత్మపరిశీలన చేసుకోవాలని సురేఖ అన్నారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారిలో తామే ముందున్నామని గుర్తుచేశారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించింది రేవంత్‌రెడ్డినేనని చెప్పారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని సురేఖ స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు అభిమానం ఉందన్నారు. 2018లో కూడా ఇదే "దుష్టశక్తులు" తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నాయని, అందుకే అప్పట్లో బీఆర్ఎస్ వైపు చూడాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని విషయాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్లు వెల్లడించారు.

**జగ్గారెడ్డి, రాజగోపాల్ రెడ్డిపై చర్యలేవి?**

ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, కనీసం తన వివరణ కూడా కోరకుండా ఏకపక్షంగా బర్తరఫ్ చేశారని సురేఖ ఆక్షేపించారు. గతంలో జగ్గారెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ ఎటువంటి చర్యలు తీసుకుందని ఆమె ప్రశ్నించారు. బర్తరఫ్ చేశారని భయపడి తాను పార్టీ వదిలి వెళ్లనని, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేయనని తెలిపిన సురేఖ.. అసెంబ్లీకి కూడా హాజరవుతానని స్పష్టం చేశారు.



# బీసీ బిడ్డ బర్తరఫ్

**మొదటి పేజీ తరువాయి**

వేటు పడడం ఖాయమనే ఊహాగానాలు చెలరేగాయి. రెండు రోజుల ఢిల్లీ పర్యటన ముగించుకుని గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరడానికి ముందు.. సురేఖ, చిన్నారెడ్డి విషయంలో సీఎంవో కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. అంతకుముందే వీరిద్దరి ఉద్వాసనకు పార్టీ హైకమాండ్ ఆమోదం తెలిపింది. హైదరాబాద్‌కు వచ్చి రాగానే.. చంచల్‌గూడ – సంతోష్‌నగర్ స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన రేవంత్.. ఆ తర్వాత లోక్‌భవన్‌కు చేరుకుని గవర్నర్ శుక్లాతో భేటీ అయ్యారు. ఆ తర్వాత సురేఖ తొలగింపుపై లోక్‌భవన్ బులెటిన్ జారీ చేసింది.

వ్యూహాత్మకంగా బీసీలకు పదవులు

రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ పదవి నుంచి చిన్నారెడ్డిని తొలగించిన ముఖ్యమంత్రి తక్షణమే ఆయన స్థానంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు కుమార్తె, జీహెచ్ఎంసీ మాజీ మేయర్, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి (మున్నూరుకాపు)ని నియమించారు. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కుడా) చైర్మన్‌గా మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణి (పద్మశాలి)ని నియమిస్తూ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. అలాగే రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద (గౌడ) నియమాకానికి సంబంధించిన ఉత్తర్వులు సీఎం ఢిల్లీ నుంచి తిరిగి రాకముందే జారీ అయ్యాయి.



# ధమ్కీ ఇస్తే భయపడ!

**మొదటి పేజీ తరువాయి**

రూ.20 కోట్లు కోరగా.. రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రభుత్వం నిధులు ఇస్తుందని, అయితే ఏడాదిన్నరలోపు అభివృద్ధి పనులు పూర్తి చేసే బాధ్యత ఎమ్మెల్యేదేనని స్పష్టం చేశారు. విద్య కోసం ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో అసదుద్దీన్ ఓవైసీ దేశానికి మద్దతుగా నిలిచి దేశభక్తిని చాటుకున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయ సిద్ధాంతాలు వేర్వేరుగా ఉండొచ్చని.. దేశభక్తి విషయంలో మాత్రం అందరం ఒక్కటేనని పేర్కొన్నారు. కేబుల్ బ్రిడ్జిని చూడాలంటే ప్రస్తుతం దుర్గం చెరువుకు వెళ్లాల్సి వస్తోందని సీఎం అన్నారు. అందుకే మీరాలం చెరువులో సుమారు 3 కిలోమీటర్ల మేర కేబుల్ బ్రిడ్జిని నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే వచ్చే ఎన్నికల్లోగా గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలు సేవలను పూర్తి చేస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల సమయంలో మెట్రోలో ప్రయాణిస్తూ ప్రజలను ఓట్లు అడుగుతామని వ్యాఖ్యానించారు.

**హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు**

హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. హిందువులు, ముస్లింలు కలిసి ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారని సీఎం ఆరోపించారు. మూసీని అభివృద్ధి చేసి నగరంలో నైట్ ఎకానమీని ప్రోత్సహిస్తామని తెలిపారు. పేద ముస్లింలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్, వనస్థలిపురం, రాజేంద్రనగర్, శంషాబాద్ వరకు మెట్రోను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం భావిస్తోందని సీఎం అన్నారు. అయితే బీజేపీ, బీఆర్ఎస్ అడుగడుగునా అడ్డుపడుతున్నాయని విమర్శించారు. ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయని.. ఎన్నికలు పూర్తయ్యాక అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి అన్నారు. అందరూ కలిసి హైదరాబాద్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

# ర్యాష్ డ్రైవింగ్‌కు లైసెన్స్ పాయింట్లు కట్

**మొదటి పేజీ తరువాయి**

వెల్లడించారు. ప్రతిపాదిత విధానంలో ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనకు డ్రైవింగ్ లైసెన్స్‌పై పాయింట్లు తగ్గుతాయని చెప్పారు. నిర్ణయించిన పరిమితి దాటితే లైసెన్స్‌ను ముందుగా సస్పెండ్ చేసి, ఆ తర్వాత రద్దు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. మంచి పాయింట్లు సాధించే డ్రైవర్లకు బీమా సంస్థల నుంచి ప్రత్యేక ప్రయోజనాలు కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు గడ్కరీ చెప్పారు. వాహన రిజిస్ట్రేషన్‌కు కూడా ఇదే తరహా పాయింట్ల విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. దేశంలో రోడ్డు ప్రమాదాల పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. 2024లో బస్సు ప్రమాదాల్లో 3,855 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 81,780 మంది మరణించారని చెప్పారు. సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల 14,466 మరణాలు నమోదయ్యాయని, హిట్ అండ్ రన్ ఘటనల్లో 34,030 మంది చనిపోయారని వివరించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో ఫోన్ వాడటం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయని గడ్కరీ చెప్పారు. భారీ వాహనాలు, నిర్మాణ యంత్రాల డ్రైవర్లకు తప్పనిసరి శిక్షణపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. జేసీబీ వంటి సంస్థలు పరికరాలు విక్రయించే ముందే ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు.

# వాట్సాప్‌లోనే కరెంట్, గ్యాస్ బిల్లుల చెల్లింపు

**మొదటి పేజీ తరువాయి**

ఇది లభిస్తుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సేవ ద్వారా దేశవ్యాప్తంగా 30 కేటగిరీలకు చెందిన సుమారు 22,722 మంది బిల్లర్లకు చెల్లింపులు చేయవచ్చు. వాట్సాప్ హోమ్ స్క్రీన్ పైన ఉన్న రూపాయి గుర్తుపై ట్యాప్ చేయడం ద్వారా ఈ బిల్ పేమెంట్స్ విభాగానికి వెళ్లవచ్చు. ఇక్కడ గతంలో చెల్లించిన బిల్లుల వివరాలు, రాబోయే చెల్లింపుల సమాచారం కూడా చూసుకోవచ్చు. యూపీఐతో పాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కూడా బిల్లులు చెల్లించే సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా మెటా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, కంట్రీ హెడ్ అరుణ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "భారత్‌లో కోట్లాది మందికి వాట్సాప్ ఇప్పటికే కుటుంబ సభ్యులు, స్నేహితులతో కనెక్ట్ అవ్వడానికి, వ్యాపారాలతో మాట్లాడటానికి, ప్రభుత్వ సేవలు పొందటానికి ఒక సులభమైన మార్గంగా ఉంది. ఇప్పుడు ప్రతి ఇంట్లో అత్యంత సాధారణమైన పని అయిన బిల్లుల చెల్లింపును కూడా అంతే సులభతరం చేస్తున్నాం. మెసేజ్ పంపినంత తేలికగా బిల్లులు చెల్లించేలా చేయడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు.



# సీజేపీలో రెబల్స్

**మొదటి పేజీ తరువాయి**

ఎంపిక చేసిన బృందంగా మారిపోవడమే సీజేపీ–డీ ఏర్పాటుకు కారణమని వివరించారు. కాగా, ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై మనీష్ బ్రహ్మభట్ పలు విమర్శలు చేశారు. నిరసనకారులను పక్కనపెట్టి, యువత నేతృత్వంలోని ఈ ఉద్యమాన్ని తమకు నచ్చిన వారితో కూడిన 'కేజ్రీవాల్ టీమ్'గా సీజేపీని దీప్కే మార్చేశారని ఆయన ఆరోపించారు. ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ఆప్ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే వ్యక్తులు అసలు ఉద్యమాన్ని తమ గుప్పిట్లోకి తీసుకున్నారని ఆయన మండిపడ్డారు. మరోవైపు సీజేపీ జాతీయ స్థాయి నాయకత్వ బృందం కూర్పును మనీష్ బ్రహ్మభట్ ప్రశ్నించారు. జంతర్ మంతర్ ఆందోళనకు మద్దతు ఇచ్చిన ప్రజలకు, వర్గాలకు ఇందులో ప్రాతినిధ్యం లభించలేదని ఆరోపించారు. 'రాజకీయ ఒప్పందాలు చేసుకోవడమే వారి లక్ష్యం. విద్యార్థులు లేదా ఇతర రాష్ట్రాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల కోసం పోరాడటంలో వారికి ఎలాంటి ఆసక్తి లేదు. దానికి బదులుగా, కేవలం కేజ్రీవాల్ ఆదేశాల మేరకు నడుస్తూ, బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న పార్టీలకు మద్దతు ఇచ్చేందుకే వారు బీజేపీని వ్యతిరేకించాలనుకుంటున్నారు' అని విమర్శించారు. సీజేపీ కేంద్ర బృందానికి ఎంపికైన ఎనిమిది మందికి ఆప్‌తో సంబంధాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. కాగా, ఆగస్ట్‌లో అభిజిత్ దీప్కే నివాసంలో నిర్వహించిన సీజేపీ కోర్ టీమ్ సమావేశం గురించి తెలుసుకున్న మనీష్ బ్రహ్మభట్ గుజరాత్ నుంచి మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌కు చేరుకున్నారు. జంతర్ మంతర్ నిరసనల్లో చురుకుగా పాల్గొన్న వాలంటీర్లను చర్చలకు దూరంగా ఉంచారని ఆయన ఆరోపించారు. తన సహచరుడు రాహుల్ పాండ్యాతో కలిసి నాడు దీప్కే ఇంటి వద్ద నిరసన చేపట్టిన మనీష్, తాజాగా సీజేపీ రెబల్ వర్గమైన (సీజేపీ–డీ)ని ఏర్పాటు చేశారు.

# నీళ్లివ్వకపోతే పాదయాత్ర చేస్తా

**మొదటి పేజీ తరువాయి**

537 అడుగుల నీరు ఉందని కేటీఆర్ అన్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా.. సాగర్‌లో నీళ్లు ఉన్నా జిల్లాలోని మంత్రులకు సోయి లేదని విమర్శించారు. సాగర్‌లో నీళ్లు ఉన్నా ఇద్దరు మంత్రులు శనిలాగా దాపురించారని వ్యాఖ్యానించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



తెలంగాణ రైతుల కళ్లలో కన్నీళ్లు పెట్టిస్తున్నారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నీళ్లలో వాటర్ కలిస్తే సొరంగం కూలిపోయిందని అంటున్నారని విమర్శించారు. కళ్లు ఉండి చూడలేని మంత్రులుగా వ్యవహరిస్తున్నారని, శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నీళ్లు ఉన్నా చూడడం లేదని అన్నారు. శ్రీశైలంలో జలవిద్యుత్ ఉత్పత్తి ద్వారా 40 నుంచి 50 టీఎంసీల నీరు సాగర్‌లోకి వచ్చిందని కేటీఆర్ తెలిపారు. శ్రీశైలంలో గేట్లు తెరిచేలోపే సాగర్‌లోకి నీళ్లు వచ్చాయని, సాగర్‌లో రెండు పంటలకు నీళ్లు వచ్చాయని అన్నారు. ఈ సీజన్‌లో నాగార్జునసాగర్‌లో 180 టీఎంసీల నీరు ఉన్నదని, ఆ నీటిని విడుదల చేయడానికి సంపూర్ణ అవకాశం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను తెలంగాణ ప్రజలు చూశారని కేటీఆర్ అన్నారు. వెయ్యి రోజుల దుష్టపరిపాలన నిన్నటితో పూర్తయిందని, కేసీఆర్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉండేదో ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు గమనించాలని కోరారు.

# పసిఫిక్ మరుగుతోంది!

**మొదటి పేజీ తరువాయి**

ప్రక్రియ. దీని ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాదు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల తీరును మార్చగలదు. ఎల్‌నినోను పర్యవేక్షించే కీలక ప్రాంతమైన నినో 3.4 లో మే నుంచి జులై 2026 వరకు సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. జులైలో ఈ తేడా 2 డిగ్రీలకు చేరింది. జులై చివరి నుంచి ఆగస్టు మధ్య వరకు వారపు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.2 నుంచి 2.6 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదయ్యాయి. సముద్రం అడుగుభాగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. జులై, ఆగస్టు ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 8 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో 2026 చివరి నాటికి ఎల్‌నినో చాలా బలమైన స్థాయికి చేరుకోవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేస్తోంది. ఎల్‌నినో ప్రభావం అన్ని దేశాల్లో ఒకేలా ఉండదు. అయితే భారత్‌కు ఇది కీలకమైన వాతావరణ సంకేతం. సాధారణంగా ఎల్‌నినో బలపడిన సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉంటుంది. ఫలితంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడొచ్చు. భారత్‌లో 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ఆందోళనకర అంచనా ఇచ్చింది. మేలో విడుదల చేసిన అంచనాలో సీజన్ మొత్తం వర్షపాతం దీర్ఘకాల సగటులో 90 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం 60 శాతంగా అంచనా వేసింది. ఆ అంచనాలకు అనుగుణంగానే ఆగస్టు ముగిసే నాటికి దేశంలో వర్షపాతం 16 శాతం లోటుగా నమోదైంది. ఎల్‌నినో బలపడటంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో తీవ్రమైన వేడి, కరవు, వరదల ముప్పు పెరగొచ్చని డబ్ల్యూఎంఓ హెచ్చరిస్తోంది. సెప్టెంబర్–నవంబర్ మధ్య దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అయితే వర్షపాతం మాత్రం ప్రాంతాన్ని బట్టి మారుతుందని తెలిపింది. భారత్‌పై ఎల్‌నినో ప్రభావాన్ని ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ సమయంలో పాజిటివ్ ఐఓడీ ఏర్పడే అవకాశం ఉందని అంచనా. దీంతో ఎల్‌నినో వల్ల భారత్‌లో సాధారణంగా కనిపించే ప్రభావాల్లో కొంత మార్పు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు.



# అక్టోబర్ 11 నుంచి దేవీ నవరాత్రులు

## ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు

### రోజుకో అలంకరణలో అమ్మవారు




విజయవాడ, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): బెజవాడ కనకదుర్గమ్మ కొలువైయున్న ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలకు ముహూర్తం ఖరారయింది. శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో 2026 సంవత్సరానికి సంబంధించిన దసరా నవరాత్రి మహోత్సవాల షెడ్యూల్‌ను ఆలయ అధికారులు విడుదల చేశారు. అక్టోబర్ 11న ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభమై అక్టోబర్ 20న విజయదశమి వరకు పది రోజుల పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ పది రోజుల పాటు అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. నవరాత్రి మహోత్సవాల్లో తొలి రోజు అయిన అక్టోబర్ 11న ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు శ్రీ బాలా త్రిపురసుందరి దేవిగా అమ్మవారు దర్శనమివ్వనున్నారు. అక్టోబర్ 12న ఆశ్వయుజ శుద్ధ విదియ రోజు శ్రీ గాయత్రీ దేవిగా, అక్టోబర్ 13న ఆశ్వయుజ శుద్ధ తదియ రోజు శ్రీ అన్నపూర్ణాదేవిగా, అక్టోబర్ 14 ఆశ్వయుజ శుద్ధ చవితి రోజు శ్రీ మీనాక్షి దేవిగా, అక్టోబర్ 15 ఆశ్వయుజ శుద్ధ పంచమి రోజు శ్రీ లలితా త్రిపురసుందరి దేవిగా, అక్టోబర్ 16న ఆశ్వయుజ శుద్ధ షష్ఠి రోజుశ్రీ సరస్వతి దేవిగా, అక్టోబర్ 17 ఆశ్వయుజ శుద్ధ సప్తమి నాడు శ్రీ మహాలక్ష్మీ దేవిగా, అక్టోబర్ 18న ఆశ్వయుజ శుద్ధ దుర్గాష్టమి రోజు శ్రీ దుర్గాదేవిగా, అక్టోబర్ 19న ఆశ్వయుజ శుద్ధ మహానవమి రోజు శ్రీ మహిషాసురమర్ధిని దేవిగా, అక్టోబర్ 20న విజయదశమి నాడు శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు దర్శనమివ్వనున్నారు. అమ్మవారి అలంకరణలో ప్రత్యేక రోజులుగా అక్టోబర్ 16, అక్టోబర్ 18, 19 తేదీలను చూస్తారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు చదువుల తల్లి సరస్వతి దేవిగా దర్శనమివ్వనున్నారు. ఈ రోజున విద్యార్థులు ప్రత్యేక పూజలు చేయనున్నాను. అక్టోబర్ 18, 19 తేదీల్లో దుర్గాష్టమి, మహానవమి రోజుల్లో అమ్మవారు అత్యంత శక్తిస్వరూపిణిగా దుర్గాదేవి, మహిషాసురమర్ధిని రూపాల్లో భక్తులకు అభయాన్ని అందించనున్నారు. దసరా మహోత్సవాల్లో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు.

## తెలంగాణ హక్కులపై మోదీని నిలదీయాలి

**బీజేపీ నేతలకు మంత్రి పొన్నం సవాల్**



హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు.

## అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్: రాజగోపాల్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే అంతిమమని, దానికి అందరూ కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. మునుగోడులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. "కొండా సురేఖకు సంబంధించిన పూర్తి నివేదిక హైకమాండ్ వద్ద ఉంది. పార్టీ తీసుకునే నిర్ణయానికి ఆమె కట్టుబడి ఉండాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలను కాంగ్రెస్ అధిష్ఠానమే పర్యవేక్షిస్తుందని తెలిపారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడిన కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం చేయడమే తన ప్రధాన కర్తవ్యమని రాజగోపాల్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. తన పూర్తి దృష్టి కార్యకర్తల సంక్షేమంపైనే ఉందని పేర్కొన్నారు.

## ఏపీ మున్సిపల్ ఎన్నికలకు లైన్ క్లియర్

**హైకోర్టులో కూటమి సర్కార్ కు ఊరట**

అమరావతి, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు లైన్ క్లియర్ అయ్యింది. డివిజన్లు, వార్డుల పునరావిభజనకు సంబంధించి న్యాయపరమైన చిక్కులు తొలగిపోయాయి. ఈ ప్రక్రియను సవాల్ చేస్తూ విశాఖపట్నం సహా పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయితీల్లో దాఖలైన పిటిషన్లును కొట్టేసింది ఏపీ హైకోర్టు. దీంతో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియర్ అయ్యింది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది ఏపీ ప్రభుత్వం. గతంలో ఉన్న 3వేల 916 వార్డుల స్థానంలో కొత్తగా 4 వేల 843కి పెంచే ప్రక్రియను ప్రారంభించింది ప్రభుత్వం. అయితే.. ఈ ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పలు ప్రాంతాల నుంచి హైకోర్టులో పిటిషన్లు పిటిషన్లు దాఖలయ్యాయి. సర్ ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలో ఈ విభజన సరికాదంటూ పిటిషనర్లు అభిప్రాయపడటంతో గతంలో స్టే ఇచ్చింది హైకోర్టు. అయితే.. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా ప్రభుత్వం హైకోర్టులో బలమైన వాదనలు వినిపించింది. నిబంధనల ప్రకారమే పునర్విభజన చేస్తున్నామని.. వార్డుల భౌగోళిక వైశాల్యంలో ఎలాంటి మార్పులు చేయడంలేదని స్పష్టం చేసింది ప్రభుత్వం. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు సదరు పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

# బీసీ మహిళ కాబట్టే వేటు వేశారు

**కొండా సురేఖ బర్తరఫ్ పై శ్రీనివాస్ గౌడ్**



నారాయణపేట, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): తెలంగాణ కేబినెట్ నుంచి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బర్తరఫ్‌పై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఒక బీసీ మహిళా మంత్రిని పదవి నుంచి తొలగించాలనుకోవడం దారుణమని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనకు నిరసనగా నారాయణపేట జిల్లా కోస్గిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన 'బీఆర్ఎస్ రైతు గర్జన' సభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు నిత్యం ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా బహిరంగంగానే మాట్లాడుతున్నారని, కానీ కేవలం ఓ బీసీ మహిళా నాయకురాలిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని పదవి నుంచి తొలగించడం కాంగ్రెస్ వైఖరికి అద్దంపడుతోందని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. సొంత పార్టీ మంత్రుల్లో కొందరికి ఒక న్యాయం, కొండా సురేఖకు మరొక న్యాయమా? అని నిలదీశారు. ప్రస్తుత కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అవినీతి, కమీషన్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం, సురేఖ విషయంలో మాత్రం ఇంత కఠినంగా వ్యవహరించడం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచనా ధోరణి ఉందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలను అనేక రకాలుగా మోసం చేస్తూ వస్తోందని, పదవుల తొలగింపులోనూ బడుగు, బలహీన వర్గాల నేతలనే బలిపశువులను చేస్తున్నారని విమర్శించారు. కొండా సురేఖ ఉద్వాసన కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయమైనప్పటికీ, ఒక బలమైన బీసీ నాయకురాలికి జరిగిన ఈ అన్యాయాన్ని ప్రజలు, బీసీ వర్గాలు గమనిస్తున్నాయని అన్నారు.

# ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే తట్టుకోలేరు

**కొండా మురళి ఘాటు వ్యాఖ్యలు!.. వెనక్కి తగ్గేది లేదని స్పష్టమైన సంకేతాలు**



హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన నేపథ్యంలో ఆమె భర్త, సీనియర్ నేత కొండా మురళి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. సురేఖ బర్తరఫ్ తర్వాత తొలిసారి స్పందించిన ఆయన.. ఎక్స్ వేదికగా భావోద్వేగంతో పాటు ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఉన్నది ఉన్నట్లు మాట్లాడితే ఇక్కడ ఎవరూ తట్టుకోరు" అంటూ కొండా మురళి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. తాము ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితులు రేపు ఇంకెవరికి ఎదురవుతాయో అంటూ ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. పదవులు ఉన్నా లేకపోయినా తమ గౌరవం తమకు ఎప్పుడూ ఉంటుందని కొండా మురళి పేర్కొన్నారు. ప్రతి విషయానికీ వెంటనే స్పందించకపోవచ్చని.. కానీ జరుగుతున్న ప్రతి పరిణామాన్ని లోతుగా గమనిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. తమపై అన్ని దరిద్రాలు ఒక్కటై కుట్రపూరితంగా రాజకీయ దాడులు చేశాయని మురళి ఆరోపించారు. అయితే తాము దేనికీ భయపడబోమని చెప్పారు. ఎంతటి కష్టాలు ఎదురైనా దృఢంగా నిలబడి తట్టుకుంటామని.. మొండిగా ఎదురువెళ్తామని పేర్కొన్నారు. కొండా సురేఖ మంత్రి పదవి కోల్పోయిన వెంటనే కొండా మురళి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. తమపై జరిగిన రాజకీయ కుట్రలను తిప్పికొడతామన్న సంకేతాలను ఆయన తన పోస్టు ద్వారా ఇచ్చారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కొండా దంపతుల తదుపరి రాజకీయ అడుగులపై ఆసక్తి నెలకొంది. మరోవైపు మధ్యాహ్నం సురేఖ బర్తరఫ్ వార్తలు బయటకు రాగానే మురళి తన నివాసం వద్ద తనదైన శైలిలో రియాక్షన్ ఇచ్చారు. బయటకు వచ్చి విలేకరులను చూస్తూ మీసం మేలేశారు. తాము ఏమాత్రం చింతించడం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. ఎవరూ అధైర్యపడొద్దని.. భరోసాతో ఉండాలని పరోక్షంగా కార్యకర్తలకు సూచించారు.

## గంజా క్వీన్ నీతూ బాయిపై ఈడీ రైడ్స్

**మనీలాండరింగ్ ఆరోపణలపై 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కీలక నిందితురాలిగా ఉన్న నీతూ బాయి అలియాస్ 'గంజా క్వీన్'కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. నీతూ బాయి, ఆమె అనుచరులతో సంబంధం ఉన్న నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడులు నగరంలో కలకలం రేపాయి. తెలంగాణ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం 'ఈగల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గతంలో నీతూ బాయి, ఆమె ముఠాపై నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ విచారణను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 'నశా ముక్త్ భారత్' ప్రచారంలో భాగంగా మాదకద్రవ్యాల కేసులపై కేంద్ర ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ సోదాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన పలు కేసుల్లో నీతూ బాయి పరారీలో ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి. ఈగల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) కింద కేసు నమోదు చేసిన ఈడీ, గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన అక్రమ ఆదాయం, దానిని ఎలా మళ్లించారనే దానిపై దృష్టి సారించింది. ముఖ్యంగా ఈ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన కోట్లాది రూపాయలను హవాలా మార్గాల్లో తరలించినట్లు ఈడీ బలంగా అనుమానిస్తోంది. గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుతో అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది.

## వివేకా హత్య కేసులో ఈడీ ఎంట్రీ

**రూ. 40 కోట్ల డీల్‌పై అప్రూవర్ దస్తగిరి విచారణ**

కడప, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీవ్రతరం చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి మధ్య జరిగిన భారీ ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని విచారిస్తున్నారు. వివేకా హత్య వెనుక ఆర్థిక మూలాలను, మనీ లాండరింగ్ కోణాన్ని వెలికితీసేందుకు ఈడీ ఈ దర్యాప్తును వేగవంతం చేసింది. హత్య వెనుక ఎర్ర గంగిరెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలతో పాటు మరికొందరి మధ్య రూ. 40 కోట్ల డీల్ జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై ఈడీ అధికారులు దస్తగిరిని ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా వివేకా హత్యకు ముందు, ఆ తర్వాత అనుమానాస్పదంగా జరిగిన బ్యాంకు లావాదేవీల చిట్టాను బయటకు తీస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు దస్తగిరి తన బ్యాంకు ఖాతాల స్టేట్‌మెంట్లతో విచారణకు హాజరయ్యారు. గతంలో సీబీఐ విచారణ సందర్భంగా... వివేకాను హత్య చేసేందుకు తనకు రూ. 5 కోట్లు ఇస్తామని ఒప్పందం చేసుకున్నట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చారు. నాటి సీబీఐ స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని, ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరెవరి ఖాతాల్లోకి బదిలీ అయిందనే విషయాలపై ఈడీ ఆరా తీస్తోంది.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## టీటీడీ డిప్యూటీ ఈవోకు రూ.5 కోట్ల అక్రమాస్తులు

**లోకనాథం అరెస్ట్.. బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాలు**

తిరుమల, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) డిప్యూటీ ఈవో లోకనాథంను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో ఆయనను అదుపులోకి తీసుకున్న అధికారులు, అనంతరం తదుపరి విచారణ నిమిత్తం ఏసీబీ కార్యాలయానికి తరలించారు. నిన్న ఉదయం నుంచే తిరుపతి ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి లోకనాథం నివాసంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ విస్తృత సోదాలు నిర్వహించారు. సుదీర్ఘంగా సాగిన ఈ తనిఖీల్లో దాదాపు రూ. 5 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను ఏసీబీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. తనిఖీల సమయంలో ఆయన నివాసంలో 2 కిలోల బంగారం, 6.5 కిలోల వెండి, రూ. 12.50 లక్షల ద్రవ్య నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ఆయన భార్య, కుమారుడి పేర్లతో పలుచోట్ల ఇళ్లు, విలువైన స్థలాలు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. నిన్న ప్రారంభమైన సోదాలు ముగిసిన వెంటనే, ఈరోజు ఆయనను అరెస్ట్ చేశారు. టీటీడీ కీలక అధికారిని ఏసీబీ అరెస్ట్ చేయడం ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో తీవ్ర కలకలం రేపింది.

## ప్రజల భక్తి అపహాస్యం

**రామ మందిర నిధుల చోరీపై నివేదిక బయటపెట్టాలి**

**హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): అయోధ్య రామ మందిర నిర్మాణానికి అందిన విరాళాల్లో జరిగిన అవకతవకలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన నివేదికను ఎందుకు బహిర్గతం చేయడం లేదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రజల విశ్వాసాన్ని అపహాస్యం చేయడంతో వారు ఆగ్రహంగా ఉన్నారని ఆయన అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఒవైసీ మీడియాతో మాట్లాడారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు తొలి సీఈవోగా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నియమించడంపై ఒవైసీ స్పందించారు. "గతంలో చేసిన నియామకాలు ఎవరు చేశారు? ప్రభుత్వమే కదా? పార్లమెంటులో బిల్లు పెట్టి ట్రస్టును ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కూడా కోట్లాది రూపాయల దొంగతనం జరిగింది. ఇప్పుడు ఎవరిని నియమించుకున్నా అది ప్రభుత్వ ఇష్టమే. కానీ, ఆ దొంగతనం ఎవరు చేశారో ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారు" అని అన్నారు. ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదై, నివేదిక కూడా సిద్ధంగా ఉన్నప్పుడు దానిని ఎందుకు బయటపెట్టడం లేదని ఆయన నిలదీశారు. నమ్మకం పేరుతో ఓట్లు, అధికారం సంపాదించి కొందరు అందినకాడికి దోచుకున్నారని ఆరోపించారు. తెలంగాణలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలోనూ అవకతవకలు జరుగుతున్నాయని ఒవైసీ అన్నారు. మ్యాపింగ్‌లో తేడాలు, ఒకే కుటుంబంలో ఆరుగురికి పైగా ఓటర్లు ఉన్న సందర్భాల్లో నోటీసులు జారీ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి నోటీసులు అందుకున్న వారు వెంటనే విచారణకు హాజరై ఆధార్ కార్డు, ఇతర పత్రాలను సమర్పించాలని సూచించారు. కొందరు ఓటర్లు బతికి ఉన్నా, తమ చిరునామాలోనే నివసిస్తున్నా, చనిపోయినట్లుగా లేదా వేరే ప్రాంతానికి మారినట్లుగా తప్పుగా నమోదు చేస్తున్నారని ఫిర్యాదులను ప్రస్తావించారు.



# రోడ్డుపై వాహనాల డ్యాన్సులు

జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. బ్లాక్ చౌరస్తా నుంచి మల్యాల ఎక్స్ రోడ్ వరకు ఉన్న రహదారిపై అడుగడుగునా పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులకు నరకం కనిపిస్తోంది. నిత్యం వందలాది ప్రయాణించే ఈ మార్గాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో రహదారి పరిస్థితి రోజురోజుకూ మరింత దయనీయంగా మారుతోంది. రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, పాఠశాల వాహనాలు, అత్యవసర సేవల వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గుంతలను తప్పించుకునేందుకు వాహనదారులు ఒక్కసారిగా వాహనాలను పక్కకు మళ్లించడం, ఎదురుగా వచ్చే వాహనాల మార్గంలోకి వెళ్లడం వంటి పరిస్థితులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వర్షం పడినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాటి లోతు ఎంత ఉందో వాహనదారులకు కనిపించని పరిస్థితి నెలకొంటోంది. తెలియక గుంతల్లోకి వాహనాలు దిగడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పే ప్రమాదం ఉంది. రాత్రివేళల్లో వీధి వెలుతురు సరిగా లేకపోవడం, గుంతలు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. ఇంతటి కీలకమైన రహదారి నెలల తరబడి గుంతలతో దర్శనమిస్తున్నా సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారంపై దృష్టి పెట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించే పరిస్థితి రాకముందే అధికారులు మేల్కొని రహదారిని బాగుచేయాలని కోరుతున్నారు.

- మల్యాల, ఈవార్తలు



# డివైడర్లపై పిచ్చి మొక్కల ఫోజులు

జగిత్యాల నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో జగిత్యాల శివారు ప్రాంతంలోని డివైడర్లు పిచ్చిమొక్కలతో నిండిపోయి అధ్వానంగా మారుతున్నాయి. రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో మొక్కలు అడ్డదిడ్డంగా పెరిగి రహదారి అందాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణంలోకి ప్రవేశించే సమయంలోనే ప్రయాణికులకు స్వాగతం పలకాల్సిన డివైడర్లు పచ్చదనంతో కళకళలాడాల్సిందిపోయి పిచ్చిమొక్కలతో నిండిపోవడం విమర్శలకు తావిస్తోంది. కొన్ని చోట్ల మొక్కలు భారీగా పెరిగి డివైడర్ల రూపమే కనిపించని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా మొక్కల మధ్య చెత్తాచెదారం పేరుకుపోతుండటంతో డివైడర్లు పారిశుద్ధ్య సమస్యలకు కేంద్రాలుగా మారుతున్నాయి. వర్షాకాలంలో మరింత వేగంగా పెరిగే మొక్కలను సకాలంలో తొలగించకపోతే పరిస్థితి మరింత అధ్వానంగా మారే అవకాశం ఉంది.

- జగిత్యాల టౌన్, ఈవార్తలు



## గణేష్ మండపాలకు సౌకర్యాలు కల్పించాలి

**జగిత్యాల ఎంసీకి వీహెచ్‌పీ నాయకుల వినతి**

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): గణేష్ చతుర్థి ఉత్సవాలను పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని గణేష్ మండపాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), గణేష్ ఉత్సవ సమితి నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండపాల వద్ద తాగునీరు, విద్యుత్, లైటింగ్, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని గుంతల రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మండపాల వద్ద పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్, కౌన్సిలర్ అరవ లక్ష్మి, పట్టణ అధ్యక్షుడు జిట్టవేని అరుణ్‌కుమార్, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



## వైద్య సేవల్లో ఈఎస్ఐసీ సనత్‌నగర్ దూకుడు

**వైద్య విద్య, అధునాతన చికిత్సలు, డిజిటల్ ఆరోగ్య సేవల్లో ప్రత్యేక గుర్తింపు**

**ఉత్తరాఖండ్ మీడియా బృందం సందర్శన**

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (పీఐబీ): ప్రజారోగ్యం, వైద్య విద్య, అధునాతన చికిత్సలు, సాంకేతిక ఆధారిత రోగి సేవల్లో కీలక వైద్య కేంద్రంగా మారుతున్న హైదరాబాద్‌లోని ఈఎస్ఐసీ(సనత్‌నగర్)ను ఉత్తరాఖండ్‌కు చెందిన 15 మంది మీడియా ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలు, వైద్య విద్య, అధునాతన చికిత్స విధానాలు, సాంకేతిక ఆధారిత రోగి సంరక్షణపై అవగాహన కల్పించడమే పర్యటన ఉద్దేశంగా అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల, ఆసుపత్రి డీన్ డాక్టర్ ఎస్. సీతాలక్ష్మి మీడియా ప్రతినిధులకు సంస్థ వైద్య మౌలిక సదుపాయాలు, సేవలు, పురోగతిని వివరించారు. హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో నాలుగు ఈఎస్ఐ ఆసుపత్రులు, 70 డిస్పెన్సరీలు, ఎనిమిది శాఖా కార్యాలయాలు, 10 డిస్పెన్సరీ-కమ్-బ్రాంచ్ కార్యాలయాల ద్వారా తెలంగాణలోని మొత్తం 33 జిల్లాలకు ఈఎస్ఐసీ సేవలు విస్తరించాయని తెలిపారు. రాష్ట్రంలో ఈఎస్ఐ బీమా పరిధిలో 20.47 లక్షల మంది ఉద్యోగులు, 74.32 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా, 1.63 లక్షల మంది యజమానులు ఈ వ్యవస్థ పరిధిలో ఉన్నారని వెల్లడించారు . ప్రాంగణంలో మొత్తం 1,044 పడకల సమీకృత వైద్య సదుపాయం ఉంది. ఇందులో 800 పడకల ఈఎస్ఐసీ వైద్య కళాశాల, ఆసుపత్రితోపాటు 244 పడకల అత్యున్నత ప్రత్యేక వైద్య ఆసుపత్రి ఉన్నాయి. 159 ఐసీయూ పడకలు, 45 డయాలసిస్ పడకలు, 10 ఆధునిక శస్త్రచికిత్స గదులు, ఐదు అత్యాధునిక శస్త్రచికిత్స విభాగాలు అందుబాటులో ఉన్నాయి. అత్యవసర సేవలు నిరంతరం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గత నాలుగేళ్లలో ఆసుపత్రిలో రోగుల సేవల వినియోగం గణనీయంగా పెరిగింది. 2022లో 6.93 లక్షలుగా ఉన్న వార్షిక బహిరంగ రోగుల సంఖ్య 2025లో 9.80 లక్షలకు చేరింది. రోజువారీ సగటు బహిరంగ రోగుల సంఖ్య 2,354 నుంచి 3,248కు పెరిగింది. ఇదే సమయంలో వార్షిక ఆసుపత్రి చేరికలు 78,086 నుంచి 95,037కు, శస్త్రచికిత్సలు 16,223 నుంచి 20,117కు పెరిగాయి. 2025లో పడకల వినియోగం 85.6 శాతంగా నమోదైంది. 500కు పైగా పడకల విభాగంలో సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రులు 2019 నుంచి వరుసగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఆసుపత్రులుగా గుర్తింపు పొందుతున్నాయని అధికారులు తెలిపారు. మీడియా ప్రతినిధుల బృందానికి డాక్టర్ జయ కుందన్ గెడమ్, డాక్టర్ రత్నా గోసైన్, డాక్టర్ జి. లక్ష్మీ ప్రసాద్, డాక్టర్ జి. తిరుపతి వివిధ వైద్య, విద్యా సదుపాయాలను వివరించారు. అనంతరం ప్రతినిధులు ఆసుపత్రిలోని ప్రయోగశాలలను సందర్శించి ఆధునిక రోగనిర్ధారణ సదుపాయాలను పరిశీలించారు.

# ఆదికి అదృష్టం దక్కేనా..?

## కొండా సురేఖకు ఉద్వాసన.. మంత్రి బెర్త్‌పై ఆది శ్రీనివాస్ పేరు



**బీసీ కోటా.. విధేయత.. విప్ అనుభవం!**

**వేములవాడకు తొలిసారి మంత్రి పదవిపై చర్చ**

కరీంనగర్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు గవర్నర్‌కు సిఫార్సు చేశారు. దీంతో ఖాళీ కానున్న మంత్రి పదవిని ఎవరితో భర్తీ చేస్తారన్న చర్చ ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో మొదలైంది. ఈ క్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేరు మరోసారి తెరపైకి వచ్చింది.

**సురేఖ స్థానంలో ఆది?**

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఏడాదికాలంగా రకరకాల ప్రచారాలు కొనసాగుతున్నాయి. ప్రతి సందర్భంలోనూ ఆది శ్రీనివాస్ పేరు మంత్రి రేసులో వినిపిస్తూనే ఉంది. అయితే అధిష్ఠానం నుంచి స్పష్టమైన నిర్ణయం లేకపోవడంతో అది ముందుకు సాగలేదు. తాజాగా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడంతో.. ఖాళీ అయ్యే స్థానాన్ని బీసీ సామాజిక వర్గంతో భర్తీ చేయాలన్న సమీకరణం తెరపైకి వస్తే ఆది శ్రీనివాస్‌కు అవకాశం దక్కవచ్చన్న చర్చ మళ్లీ ఊపందుకుంది.

**బీసీ సమీకరణమే కీలకమా?**

మంత్రివర్గంలో మార్పులు జరిగే సమయంలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు కీలకంగా మారుతాయి. సురేఖ స్థానంలో అదే విస్తృత సామాజిక సమీకరణాన్ని కొనసాగించాలన్న ఆలోచన ఉంటే.. మున్నూరు కాపు బీసీ వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ పేరు సహజంగానే పరిశీలనలోకి వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా బీసీ ప్రాతినిధ్యంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మరో బెర్త్ కల్పించినట్లవుతుందన్న లెక్కలు వినిపిస్తున్నాయి.

**ఏడాదిగా వినిపిస్తున్న పేరు**

ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కుతుందన్న ప్రచారం ఇప్పటిది కాదు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగిన ప్రతిసారీ ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే రాజకీయ సమీకరణాలు, అధిష్ఠానం నిర్ణయాలు, ఇతర ఆశావహుల పోటీతో ఈ అంశం వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడు మాత్రం సురేఖ తొలగింపుతో ఖాళీ ఏర్పడటంతో ఆది పేరు మరోసారి చర్చకు వచ్చింది. ఆది శ్రీనివాస్ సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌తో అనుబంధాన్ని కొనసాగిస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. పార్టీ కష్టకాలంలోనూ కాంగ్రెస్ జెండాను వీడకుండా పనిచేశారన్న పేరు ఆయనకు ఉంది. 2009 నుంచి వేములవాడ అసెంబ్లీ స్థానంలో పోటీ చేస్తూ వచ్చిన ఆయన.. 2023 ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ విప్‌గా కీలక బాధ్యతలు చేపట్టారు.

**సీనియారిటీ.. సిన్సియారిటీ**

మంత్రి పదవి కోసం పోటీలో ఆది శ్రీనివాస్‌కు పార్టీ విధేయత, రాజకీయ అనుభవం, వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తిత్వం అనుకూల అంశాలుగా మారవచ్చన్న చర్చ సాగుతోంది. ప్రభుత్వ విప్‌గా ఇప్పటికే ప్రభుత్వ వ్యవహారాలను దగ్గరగా చూసిన అనుభవం కూడా ఆయనకు కలిసొచ్చే అవకాశం ఉందని అనుచరులు భావిస్తున్నారు. ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కితే వేములవాడ రాజకీయాల్లో అది కీలక పరిణామంగా మారనుంది. నియోజకవర్గానికి ఇప్పటివరకు మంత్రి పదవి దక్కలేదన్న నేపథ్యంలో.. ఈసారి అవకాశం వస్తే వేములవాడకు రాష్ట్ర మంత్రివర్గంలో తొలిసారి ప్రాతినిధ్యం లభించినట్లవుతుంది. దీంతో నియోజకవర్గ అభివృద్ధి, నిధుల సాధన, రాజకీయ ప్రాధాన్యం మరింత పెరిగే అవకాశం ఉంటుందని ఆయన అనుచరులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంత్రివర్గంలో ఉన్నారు. ఆది శ్రీనివాస్‌కు కూడా మంత్రి పదవి లభిస్తే ఉమ్మడి జిల్లాకు నాలుగు మంత్రి పదవులు దక్కినట్లవుతుంది. ఒకే ఉమ్మడి జిల్లాకు ఇంతటి ప్రాతినిధ్యం రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. అదే సమయంలో బీసీ వర్గానికి మరింత ప్రాధాన్యం ఇచ్చిన సంకేతంగా కూడా దీనిని చూడవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆది పేరు ఎందుకు బలపడుతోంది?**

బీసీ ప్రాతినిధ్యం.. సామాజిక సమీకరణాల్లో బీసీ కోటాకు ప్రాధాన్యం ఉంటే ఆది పేరు ముందుకు రావచ్చు. పార్టీ విధేయత.. కాంగ్రెస్ కష్టకాలంలోనూ పార్టీతో కొనసాగిన నాయకుడిగా గుర్తింపు. విప్ అనుభవం.. ఇప్పటికే ప్రభుత్వంలో కీలక బాధ్యత నిర్వహిస్తున్న అనుభవం. వివాదరహిత ఇమేజ్.. సౌమ్య స్వభావం, క్రమశిక్షణతో కూడిన రాజకీయ శైలి. ప్రాంతీయ సమతుల్యత.. వేములవాడకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా ఉత్తర తెలంగాణలో రాజకీయ సమీకరణాలను సమతుల్యం చేసే అవకాశం.. ఆయనకు కలిసి వచ్చే చాన్స్ ఉంది.



## పీఎం శ్రీ పాఠశాలలో కృష్ణాష్టమి సందడి

చందుర్తి, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): చందుర్తి మండల కేంద్రంలోని పీఎం శ్రీ చందుర్తి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై సందడి చేశారు. తల్లిదండ్రుల ఆధ్వర్యంలో విద్యార్థులతో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల ఉత్సాహం, సంప్రదాయ వేషధారణలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి చందుర్తి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు తక్కళ్ల లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణుడి జన్మ విశిష్టత, కృష్ణాష్టమి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు పరిచయం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేముల సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో విజయవంతంగా జరిగాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాచకొండ ప్రసాద్, రాకం రవికుమార్, కాపిల్ల నరేశ్, మమత, స్వప్నజ్యోతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. చిన్నారుల కృష్ణాష్టమి వేడుకలతో పాఠశాల ప్రాంగణమంతా భక్తి, ఆనందం, సందడితో కళకళలాడింది.





## గౌతమ్ మోడల్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని గౌతమ్ మోడల్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ముందస్తుగా వైభవంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణల్లో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు ధరించిన పీతాంబరాలు, నెమలి పింఛాలు చూపరులను ఆకట్టుకున్నాయి. భక్తిగీతాలకు విద్యార్థులు చేసిన సంప్రదాయ నృత్యాలు, ప్రదర్శించిన నాటికలు అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బర ఉమా రమేశ్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో పిల్లలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు, జీవన నైపుణ్యాలను పెంపొందించేందుకే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరికిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు రాజ్యం రావాలంటే కేసీఆర్ రావాలి: జీవన్ రెడ్డి

రాయికల్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): రైతుల సమస్యలు పరిష్కారం కావాలంటే, రాష్ట్రంలో రైతు రాజ్యం రావాలంటే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో రైతులను పట్టించుకోకుండా వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలు, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం రాయికల్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జీవన్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను నీరుగార్చడంతో పాటు వరి ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట కోతలు విధించడం, ధాన్యానికి బోనస్ చెల్లించకపోవడం, అరకొర విద్యుత్ సరఫరాతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కేసీఆర్ ఉద్యమ నేతగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు పదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతులకు అండగా నిలిచారని అన్నారు. కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ప్రయోజనం కరువు పరిస్థితుల్లో తెలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం: సంజయ్

కోరుట్ల, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ఎక్కడ కూడా అభివృద్ధి శూన్యమని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనను విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు భరతమాత కూడలీ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే పాల్గొని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులవుతున్న ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. పంటలను పండించడానికి రైతులకు కనీసం యూరియాను కూడా అందుబాటులో ఉంచకుండా రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని ప్రభుత్వం పై ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దేవుళ్లను మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దే: అడ్లూరి

ధర్మపురి, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పుణ్యక్షేత్రాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దేవుళ్లను సైతం మోసం చేసిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. గురువారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొండగట్టు, ధర్మపురి, భద్రాద్రి, వేములవాడ పుణ్యక్షేత్రాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు కేటాయిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో అవినీతి జరిగిందంటున్న బీఆర్ఎస్ నాయకులు ఈ నెల 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తమ ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు. గతంలో మంత్రిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్ ధర్మపురికి బస్ డిపో, నైట్ కాలేజీ, రెవెన్యూ డివిజన్ ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్మపురి అభివృద్ధికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, డిగ్రీ కళాశాల ఏర్పాటు, సివరేజ్ ప్లాంట్‌కు రూ.17 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు

**2,500 మంది విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు**

**జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్**

జగిత్యాల, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో భాగంగా జగిత్యాల నియోజకవర్గానికి మంజూరైన పాఠశాల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ తెలిపారు. గురువారం తాటిపల్లి శివారులో 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి సైట్ ఇంజినీర్లతో పాఠశాల భవనాలు, వసతి గృహాలు, క్రీడా మైదానం తదితర నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మ్యాప్‌ను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఒకే ప్రాంగణంలో వసతి, భోజనం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి సౌకర్యాలు కల్పించడమే ఈ పాఠశాలల లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు 2,500 మంది విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు ఆధునిక, సమగ్ర విద్యా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులకు హాస్టల్, భోజనం తదితర వసతి సౌకర్యాలను ప్రభుత్వం కల్పించనుందని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పాఠశాల పూర్తయితే జగిత్యాల నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, సర్పంచులు బొలిశెట్టి గంగారెడ్డి, కట్ట రాజేందర్, మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కల రవీందర్‌రెడ్డి, సదానందం, నలువల సురేశ్, దాసరి సతీష్, లింగారెడ్డి, గడ్డం గంగారెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్, మహబూబ్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలుకు బీఆర్ఎస్ పోరాటం: బలరాం రెడ్డి

ధర్మారం, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్మారం మండల కేంద్రంలో వంటా వార్పు నిర్వహించనున్నట్లు మేడారం పీఏసీఎస్ చైర్మన్, బీఆర్ఎస్ నేత ముత్యాల బలరాం రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నిరసనల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ధర్మపురి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరై ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. హామీల అమలుకు డిమాండ్ చేస్తూ వంటా వార్పుతో ప్రభుత్వ తీరును ఎండగడతామని, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటాన్ని కొనసాగిస్తుందని బలరాం రెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పాలనపై రైతు నిరసన: సుంకె రవిశంకర్

కొడిమ్యాల, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కోడిమ్యాల అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన రైతు నిరసనలో ఆయన మాట్లాడారు. రూ.15 వేల రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీతో పాటు పింఛన్లపై ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఎరువులు, విత్తనాలు, సాగునీరు, విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, సాగునీరు, 24 గంటల విద్యుత్ వంటి పథకాలతో రైతులకు అండగా నిలిచామని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించకుండా కాంగ్రెస్ నాయకులు వెయ్యి రోజుల సంబరాలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో 'వెన్నెలో వెన్నెల' పాట ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని రవిశంకర్ స్పష్టం చేశారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్టీయూ

జగిత్యాల, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్ డిమాండ్ చేశారు. గురువారం జగిత్యాల రూరల్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బైరం హరికిరణ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ పీఆర్సీ ప్రకటించడం, పెండింగ్ డీఏలు, బిల్లులు మంజూరు చేయడం, సీపీఎస్ రద్దు వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. మూడున్నరేళ్లు గడిచినా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించి గుణాత్మక విద్యకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి మేకల ప్రవీణ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎగ్యరపు వెంకటేష్, మండల అధ్యక్షుడు విష్ణు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమమే మా పాలన: మేడిపెల్లి సత్యం

గంగాధర, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి టిఆర్ఎస్ పార్టీ నాయకులు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల సంక్షేమ పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం గంగాధరలో నిర్వహించిన సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగాధర మండల కేంద్రం నుండి మధురానగర్ చౌరస్తా వరకు రెండు కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్, మధురానగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 1000 రోజుల సంక్షేమ పాలన పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 25 లక్షల మంది రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీ, ప్రతి నియోజకవర్గానికి 6500 ఇందిరమ్మ ఇండ్లు, 9 లక్షల మందికి రేషన్ కార్డులు, 53 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్, 43 లక్షల మందికి చేయూత పెన్షన్లు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనకు నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఎనిమిది లక్షల కోట్ల అప్పుచేసి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులకు కుప్పగా మార్చాలని దుయ్యబట్టారు. ప్రతిపక్ష నాయకుడిగా వెయ్యి రోజులు అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్ కేసీఆర్ పరిమితమయ్యాడని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్ లు,సింగిల్ విండో చైర్మన్ లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,మహిళా కాంగ్రెస్,యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

## ముస్లిం సెంట్రల్ కమిటీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**నేడు జగిత్యాలలోని 25 మసీదుల్లో పోలింగ్**



జగిత్యాల, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): జగిత్యాల ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్ష ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జగిత్యాల ముస్లిం సెంట్రల్ ఎన్నికల కమిషనర్ మహమ్మద్ ఇమ్రాన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని అన్ని మసీదుల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం పోలింగ్ జరుగుతుందని, అన్ని మసీదుల్లో నేడు జుమ్మా నమాజ్ 1.15 నిమిషాలకు జరుగుతుందని, అన్ని మసీదులో పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించామని తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, పోలీస్ బందోబస్తు కూడా ఉంటుందని తెలిపారు. పోలింగ్ అనంతరం అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కమిటీ సభ్యులు ఆదిల్ పటేల్, తస్లిమ్ పాషా, రఫీక్, ఇంతియాజ్, అబ్దుల్లా, మాక్బుల్, సయ్యద్ అజీమ్, ముజాహిద్ పాట్వరి, నేహాల్, అఖీల్ ఉద్దీన్ జావీద్, షజీ ఫెరోజ్, ముజహిద్ ఆదిల్, షహేరజ్ ఉద్దీన్ మోసిక్, ఫజల్ బేగ్, హైదర్ అలీ, నాజీమ్, సులేమాన్, నాహిద్, అజహర్, జమీర్ అలీ అద్నన్, రియాజ్,షహేబాజ్, ఆరిఫ్, ఇక్బాల్, రూమన్, కలీమ్, ఫహద్, సవాన్, రెహన్, ఇర్షాద్, రిజ్వాన్, ముక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధం ముగింపునకు సాయం చేస్తాం

**రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ ప్రకటన**

**కీవ్‌లో ఉక్రెయిన్ విదేశాంగ మంత్రితో జైశంకర్ భేటీ**



కీవ్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు భారత్ తన వంతు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. యుద్ధానికి ముగింపు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల చేసిన పిలుపును ఆయన ప్రస్తావించారు. గురువారం కీవ్‌లో ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రి సిబిహాతో సమావేశమైన సందర్భంగా జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2022లో మొదలైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఐదో ఏడాదిలోకి ప్రవేశించిందని జైశంకర్ అన్నారు. రోజూ యుద్ధం కొనసాగితే మరిన్ని ప్రాణాలు పోవడంతో పాటు భారీ విధ్వంసం జరుగుతుందని పేర్కొన్నారు. సమస్యకు పరిష్కారం యుద్ధభూమిలో దొరకదని భారత్ మొదటి నుంచి చెబుతోందన్నారు. యుద్ధంలో ఉన్న ఇరు దేశాలే పరిష్కార మార్గాన్ని కనుగొనాల్సి ఉన్నప్పటికీ, భారత్ ఏ విధంగానైనా సహాయం చేయగలిగితే అందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. తన కీవ్ పర్యటనకు ద్వైపాక్షిక సంబంధాలే ప్రధాన ఉద్దేశమైనప్పటికీ, ప్రస్తుత యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని జైశంకర్ చెప్పారు. రెండు రోజుల క్రితం కీవ్‌లో జరిగిన దాడిలో ఓ భారతీయుడు మరణించడంపై విచారం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. యుద్ధ ప్రభావంతో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయని జైశంకర్ చెప్పారు. వివిధ దేశాల నౌకల్లో భారతీయ నావికులు పనిచేస్తున్నారని, వారిలో కొందరు కూడా ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. నౌకాయానంపై యుద్ధ ప్రభావం గ్లోబల్ సౌత్ దేశాలపై పడుతోందని, ఇంధనం, ఎరువులు, ఆహార కొరతలకు ఇది కారణమవుతోందన్నారు. ఉక్రెయిన్‌కు భారత్ ఇప్పటివరకు 19 విడతల్లో 160 టన్నుల మానవతా సాయం అందించిందని జైశంకర్ తెలిపారు. ఇందులో జనరేటర్లు, మందులు, వైద్య పరికరాలు ఉన్నాయి. ఉక్రెయిన్‌లో చదువుతున్న భారతీయ విద్యార్థుల విషయంలో ఆ దేశ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీని కలవనున్న జైశంకర్.. ప్రధాని మోదీ తరఫున శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. ద్వైపాక్షిక సహకారంపై తదుపరి చర్చల కోసం సిబిహాను భారత్‌కు రావాలని కూడా ఆయన ఆహ్వానించారు.

## నా జీవితాన్ని మార్చింది ఐఐటీ ఖరగ్‌పూరే

**భార్యను కలిసిందీ అక్కడే: సుందర్ పిచాయ్**

**వర్సిటీ 75వ వార్షికోత్సవానికి గూగుల్ సీఈఓ ప్రత్యేక సందేశం**



ఖరగ్‌పూర్: ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తన మూలాలను, విద్యార్థి జీవితపు మధుర జ్ఞాపకాలను మరోసారి గుర్తుచేసుకున్నారు. తాను చదువుకున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఖరగ్‌పూర్ 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని పంపారు. తన జీవితాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఐఐటీ ఖరగ్‌పూర్ పాత్రను వివరిస్తూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భవిష్యత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చారిత్రక మైలురాయి సందర్భంగా ఐఐటీ ఖరగ్‌పూర్ యాజమాన్యం, సుందర్ పిచాయ్ సందేశాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పంచుకుంది. "ఐఐటీ ఖరగ్‌పూర్ 75 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని, మా పూర్వ విద్యార్థి, గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ అయిన సుందర్ పిచాయ్ నుంచి ప్రత్యేక సందేశం అందుకోవడం గర్వంగా ఉంది" అని పోస్ట్‌లో పేర్కొంది. ఈ వీడియో సందేశంలో సుందర్ పిచాయ్ తన విద్యార్థి జీవితంలోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. "ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న నా తోటి పూర్వ విద్యార్థులకు నమస్కారం. ఈ 75 ఏళ్ల వేడుకల్లో పాలుపంచుకోవడం నాకు లభించిన ప్రత్యేక గౌరవం. హ్యారీస్ మెస్‌లో భోజనం నుంచి ఇల్లూ ఫెస్టివల్ వరకు, దీ308 రూమ్‌లో రాత్రుళ్లు చేసిన చదువుల నుంచి స్నేహితులతో ఏర్పడిన బంధాల వరకు ఎన్నో మధుర జ్ఞాపకాలు నా మదిలో ఉన్నాయి" అని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో '3సి' కార్యక్రమం

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించేందుకు కన్వర్జ్ వన్ (సీ1), జగతి ఫౌండేషన్ సంయుక్తంగా 'కేర్-కన్జర్వ్-కంప్యూట్ (3సి)' సమగ్ర విద్యార్థి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించాయి. మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమం తెలంగాణలో మూడు, ఆంధ్రప్రదేశ్‌లో రెండు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు కానుంది. దీనివల్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన 600 మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. గండిపేట ప్రభుత్వ పాఠశాలలో గత సోమవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీ1 ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, కంట్రీ హెడ్ చంద్ర బొడ్డోజు, సంస్థకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, జగతి ఫౌండేషన్ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆరోగ్యం, పర్యావరణం, సాంకేతికత ప్రధాన అంశాలుగా 3సి కార్యక్రమాన్ని రూపొందించారు. 'కేర్'లో భాగంగా ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, వ్యక్తిగత శ్రేయస్సుపై అవగాహన కల్పిస్తారు. 'కన్జర్వ్' ద్వారా పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత, వాతావరణ మార్పులపై అవగాహన పెంచుతారు. 'కంప్యూట్'లో కంప్యూటర్లు, సాంకేతికత, కోడింగ్, విజ్ఞాన--సాంకేతిక విద్యపై ప్రాయోగిక శిక్షణ అందిస్తారు.

## రోడ్డు విస్తరణతో చిరు వ్యాపారుల ఇక్కట్లు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): మూసాపేట డివిజన్‌లోని చిత్తారమ్మ ఆలయ పరిసర ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో అక్కడ ఏళ్లుగా తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కార్మికులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో చిత్తారమ్మ ఆలయ పరిసర ప్రాంతాలకు చెందిన తోపుడు బండ్ల కార్మికులు, చిరు వ్యాపారులు గురువారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. రోడ్డు విస్తరణ పనుల కారణంగా తమ జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, తమ కుటుంబాల జీవనం ప్రశ్నార్థకంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, జీవనోపాధికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించేలా చర్యలు తీసుకోవాలని బండి రమేశ్‌ను కోరారు. కార్మికులు, చిరు వ్యాపారుల సమస్యలను బండి రమేశ్ సానుకూలంగా విన్నారు. వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రకాశ్ ముదిరాజ్, బాలరాజు, చున్ను పాషా, గోవింద్‌గౌడ్, రమణ తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సూరమ్మ ప్రాజెక్టుపై చల్మెడ సవాల్

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): సూరమ్మ ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందించే అంశంపై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సవాల్ విసిరారు. సూరమ్మ ప్రాజెక్టు వద్ద కొబ్బరికాయ కొట్టిన ఆది శ్రీనివాస్ 43,100 ఎకరాలకు ఎప్పటిలోగా సాగునీరు అందిస్తారో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తన పదవీకాలంలో సూరమ్మ ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందిస్తే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటానని, నీరు అందించలేకపోతే ఆది శ్రీనివాస్ ఎన్నికల బరిలో నుంచి తప్పుకోవాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే రైతులను మోసం చేస్తున్నారని చల్మెడ ఆరోపించారు. అధికారంలో ఉన్నవారే నిరసనలు, ర్యాలీలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించడం తప్ప సాధించిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని చల్మెడ డిమాండ్ చేశారు.

## పన్ను మినహాయింపులు ఇస్తేనే..!

**అమెరికాతో తుది ఒప్పందం.. కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్**

న్యూఢిల్లీ: ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు సుంకాల విషయంలో మినహాయింపులకు అమెరికా అంగీకరించిన తర్వాతే ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుది వివరాలను వెల్లడిస్తామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ గురువారం తెలిపారు. "న్యూజిలాండ్‌తో వాణిజ్య ఒప్పందం త్వరలో అమలులోకి వస్తుంది.. ఆ తర్వాత 27 దేశాల కూటమి అయిన ఈయూతో అమలులోకి వస్తుంది.పోటీ దేశాలతో పోలిస్తే అమెరికా మనకు ప్రాధాన్యతా రేటును ఇచ్చేందుకు సిద్ధమైన వెంటనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఖరారు చేసి తుది వివరాలను ప్రకటిస్తాం" అని పీయూష్ గోయల్ అన్నట్లు ఏఎన్ఐ వార్తా సంస్థ నివేదించింది. 'లేవరేజింగ్ ఎఫ్‌టీఏల ఔట్‌రీచ్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాబోయే కొద్ది నెలల్లో కెనడా, మెక్సికో, చిలీ, మెర్కోసూర్, దక్షిణాఫ్రికా కస్టమ్స్ యూనియన్, గల్ఫ్ సహకార మండలి, ఇజ్రాయెల్ సహా ఇతర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, అలాగే ఆసియా, కొరియా, జపాన్ వాణిజ్య ఒప్పందాలను సమీక్షించే ప్రయత్నాలు, భారత్‌కు ఇతర పోటీదారుల కంటే తక్కువ రేటుకే ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం వాటాను అందిస్తాయని ఆయన అన్నారు. భారత్ ఇప్పటికే యూకే, మారిషస్, ఒమన్, యూఏఈ, ఆస్ట్రేలియాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు అమల్లోకి రానున్నాయని తెలిపారు.

## ఎస్బీఐ కొత్త నిబంధనలు

**అక్టోబర్ 1 నుంచి అమల్లోకి కొత్త మార్పులు**

న్యూఢిల్లీ: భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) తన వినియోగదారులకు సంబంధించి ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో లభించే ఉచిత లావాదేవీల సంఖ్యను తగ్గిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ ఖాతాదారులు ఇతర బ్యాంకులకు చెందిన ఏటీఎంలు లేదా ఆటోమేటెడ్ డెబిట్ కమ్ విత్‌డ్రాయల్ మెషీన్ల ద్వారా నెలకు 10 ఉచిత లావాదేవీలు చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే, సవరించిన నిబంధనల ప్రకారం ఈ ఉచిత లావాదేవీల సంఖ్యను 5కు పరిమితం చేశారు. పరిమితి దాటిన తర్వాత చేసే ప్రతి ఆర్థిక లావాదేవీకి (నగదు ఉపసంహరణ) రూ. 23తో పాటు జీఎస్టీ, అలాగే ఆర్థికేతర లావాదేవీలకు (బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్ వంటివి) రూ. 11తో పాటు జీఎస్టీ చార్జీలుగా వసూలు చేయనున్నారు. అయితే, ఈ మార్పు కేవలం శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు మాత్రమే వర్తిస్తుందని, అది కూడా ఇతర బ్యాంకుల ఏటీఎంలను ఉపయోగించినప్పుడు మాత్రమే వర్తిస్తుందని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. ఎస్‌బీఐకి చెందిన సొంత ఏటీఎంలలో చేసే లావాదేవీలపై ఎటువంటి పరిమితులు, అదనపు చార్జీలు ఉండవని వెల్లడించింది. అదేవిధంగా, సాధారణ సేవింగ్స్ ఖాతాదారులకు ఈ కొత్త నిబంధనలతో సంబంధం లేదని, వారికి పాత నిబంధనలే యథాతథంగా కొనసాగుతాయని బ్యాంకు పేర్కొంది.

## వేములవాడలో కాంగ్రెస్ నిరసన ర్యాలీ

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 3 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఈ ర్యాలీలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. సుమారు 500 మీటర్ల మేర ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబం రాష్ట్ర ప్రజలకు బాకీ ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడని కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌ది ఫామ్‌హౌస్ పాలన అయితే, కాంగ్రెస్‌ది ప్రజా పాలన అని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వయ్యారి చిత్రం


రైజా విల్సన్

# అంత గుడ్డిదాన్ని కాదు: తాప్సీ



ప్రముఖ కథానాయిక తాప్సీ కొంత కాలంగా పూర్తిగా బాలీవుడ్ పైనే దృష్టి సారించిన సంగతి తెలిసిందే. తాప్సీ ప్రధాన పాత్రలో నటించిన సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ 'గాంధారి' ఈరోజు నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. దేవాశిష్ మఖీజా దర్శకత్వంలో, కనికా థిల్లాన్ నిర్మించిన ఈ చిత్రంలో ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటూ తన బిడ్డ కోసం పోరాడే పవర్‌ఫుల్ తల్లి పాత్రలో తాప్సీ కనిపించారు. ఇష్వాక్ సింగ్, జతిన్ సర్నా, స్వస్తికా ముఖర్జీ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం విడుదలై మంచి స్పందన పొందుతున్న తరుణంలో.. తాప్సీ ఇండస్ట్రీ ధోరణిపై చేసిన కొన్ని సంచలన వ్యాఖ్యలు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీ... ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో వస్తున్న కొన్ని రకాల సినిమాలు, మార్కెట్ ధోరణిలను చూస్తుంటే తనకు నటనకు స్వస్తి చెప్పాలనే ఆలోచన వచ్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కథల ఎంపికలో నాణ్యత, ప్రమాణాలు తగ్గించుకుని సినిమాలు చేయాల్సిన పరిస్థితి వస్తే, నటించడం మానేసి ప్రశాంతంగా రిటైర్ అవ్వడమే తనకు ఇష్టమని తేల్చి చెప్పారు. గత కొన్ని నెలలుగా థియేటర్లలోకి వస్తున్న చిత్రాల తీరును గమనించి, "నా రిటైర్మెంట్ సమయం దగ్గరపడిందేమో" అని తన కుటుంబ సభ్యులతో కూడా సరదాగా వ్యాఖ్యానించినట్లు తెలిపారు.



# చదువుకోనందుకు బాధగా ఉంది

బాలీవుడ్ ప్రముఖ నటి కరీనా కపూర్ తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేయలేకపోయాననే లోటు తనలో ఇప్పటికీ ఉండిపోయిందని అన్నారు. సినిమాలపై ఉన్న మక్కువతో చదువును మధ్యలోనే ఆపేయడం పట్ల ఆమె తాజాగా విచారం వ్యక్తం చేశారు. కేవలం 19 ఏళ్ల వయసులో, 2000 సంవత్సరంలో అభిషేక్ బచ్చన్ సరసన 'రెఫ్యూజీ' సినిమాతో నటిగా తెరంగేట్రం చేసిన ఆమె.. ఆ తర్వాత పూర్తిగా సినిమాలపైనే దృష్టి పెట్టడంతో పదకొండవ తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పాల్సి వచ్చిందని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. తన వ్యక్తిగత అనుభవం దృష్ట్యా, తన కుమారులు ముందుగా చదువును పూర్తిగా ముగించుకున్న తర్వాతే తమకు ఇష్టమైన రంగాల వైపు అడుగులు వేయాలని కోరుకుంటున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఇక భారతదేశంలో బాలికల విద్యను ప్రోత్సహించేందుకు యూనిసెఫ్ తనను సంప్రదించినప్పుడు, తన విద్యాభ్యాసం అసంపూర్తిగా మిగిలిపోయిందనే వెలితి కారణంగానే తాను ఆ ఉద్యమంతో మానసికంగా మరింతగా కనెక్ట్ అయ్యానని తెలిపారు.




# యూట్యూబ్‌లో 'యేషనాగుల' హల్చల్

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలోని రెండో పాట 'యేషనాగుల' మరో సంచలనం సృష్టించింది. విడుదలైన ఐదు రోజుల్లోనే 50 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన తొలి తెలుగు పాటగా రికార్డు సృష్టించిందని చిత్రబృందం ప్రకటించింది. 'యేషనాగుల' పాట ఆగస్టు 29న విడుదలైంది. తెలంగాణ జానపద బాణీకి ఆధునిక టచ్ జోడించిన ఈ పాటకు మంచి స్పందన వస్తోంది. పాట విడుదలైన కొద్దిరోజుల్లోనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలోనూ ట్రెండ్‌గా మారింది. నాని, కీర్తి సురేశ్ కనిపించే ఈ పాటకు అభిమానులు భారీగా స్పందిస్తున్నారు. 'యేషనాగుల' యూట్యూబ్ గ్లోబల్ చార్టుల్లో నంబర్ వన్ ట్రెండింగ్‌లో ఉందని 'ది ప్యారడైజ్' అధికారిక ఖాతా వెల్లడించింది. ఐదు రోజుల్లో 50 మిలియన్ల మార్క్‌ను దాటడం విశేషంగా మారింది. సోషల్ మీడియాలో ఈ పాటకు సంబంధించిన రీల్స్, డ్యాన్స్ వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. పాటకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం రాశారు. ప్రభా బంగారిగల్ల, అడ్డుల జంగిరెడ్డి పాడారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్'లో నాని కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ పాట విడుదల సమయంలో అనిరుధ్ రవిచందర్ డల్లాస్ కచేరీలో నాని వేదికపైకి వచ్చి సందడి చేయడం కూడా అభిమానుల్లో ఆసక్తిని పెంచింది.



# శ్రీకృష్ణుడిగా విజయ్ దేవరకొండ?

గుజరాతీలో సంచలన విజయం సాధించి బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన 'లాలో – కృష్ణ సదా సహాయతే' సినిమా తెలుగు రీమేక్‌కు సంబంధించిన వార్తలు టాలీవుడ్‌లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తుండటంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. అంకిత్ సకియా దర్శకత్వంలో రూపొందిన ఈ డివోషనల్–డ్రామా చిత్రం గుజరాతీలో రూ. 100 కోట్లకు పైగా వసూలు చేయగా, ఈ సినిమా తెలుగు రీమేక్ హక్కులను ప్రముఖ నిర్మాత దిల్ రాజు దక్కించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొదట ఈ చిత్రంలో కీలకమైన శ్రీకృష్ణుడి పాత్రలో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తారంటూ జోరుగా ప్రచారం జరగగా, తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం ఆ స్థానంలో రౌడీ హీరో విజయ్ దేవరకొండ కనిపించనున్నాడని ప్రచారం ఊపందుకుంది. 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో ఇప్పటికే అలరించిన విజయ్ దేవరకొండ, ఇప్పుడు శ్రీకృష్ణుడి పాత్రలో నటించనున్నాడనే వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. సాధారణ ఆటో డ్రైవర్ జీవితంలో జరిగే ఊహించని పరిణామాలు, ఆధ్యాత్మిక అనుభవాలు, శ్రీకృష్ణుడి నేతృత్వంలో సాగే ఆత్మశోధన ఈ చిత్ర ప్రధానాంశం కావడంతో తెలుగు ప్రేక్షకుల భావోద్వేగాలను హత్తుకోవడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. దిల్ రాజు నిర్మాణంలో, విజయ్ దేవరకొండ లాంటి యూత్ ఫాలోయింగ్ ఉన్న హీరో ఈ శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నారనే ప్రచారంపై మేకర్స్ నుండి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

# దేశంలో నం.1 హీరోయిన్.. రష్మిక

భారత చలనచిత్ర పరిశ్రమలో సరికొత్త అధ్యాయం మొదలైంది. కన్నడ చిత్రసీమ నుంచి ప్రయాణం మొదలుపెట్టి పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన రష్మిక మందన్న, తాజాగా దేశంలోనే నంబర్ 1 హీరోయిన్‌గా నిలిచారు. ఇటీవల వెలువడిన జాతీయ స్థాయి పాప్యులారిటీ ర్యాంకింగ్‌లో, బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపిక పదుకొణెను వెనక్కి నెట్టి రష్మిక ఈ ఘనత సాధించినట్లు తెలుస్తోంది. ఇది ఆమె కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది. 'పుష్ప: ది రైజ్' చిత్రంలో ఆమె పోషించిన శ్రీవల్లి పాత్ర దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి, ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత వచ్చిన 'యానిమల్' సినిమాతో హిందీ ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ఇటీవల విడుదలైన 'పుష్ప 2: ది రూల్' ఆమె మాస్ ఇమేజ్‌ను, క్రేజ్‌ను శిఖర స్థాయికి చేర్చింది. దీంతో పాటు 'ఛావా', 'కుబేర' వంటి విభిన్న భాషల చిత్రాలతో తన నటనను, ఉనికిని అన్ని పరిశ్రమలలోనూ బలంగా చాటుకున్నారు. రష్మిక విజయం కేవలం గత చిత్రాలకే పరిమితం కాలేదు. భవిష్యత్తులోనూ ఆమె డైరీ అగ్రశ్రేణి ప్రాజెక్టులతో నిండిపోయింది. రాబోయే అక్టోబర్ 16న విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న 'రణబాలి' విడుదల కానుండగా, నవంబర్ 27న 'మైసా' ప్రేక్షకుల ముందుకు రానుంది.






# ఇండస్ట్రీలో అబ్బాయిలకూ వేధింపులు

'మా ఊరి పొలిమేర' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్‌డమ్ తెచ్చుకున్న గ్లామరస్ భామ కామాక్షి భాస్కర్ల. ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే ఫుల్ ఫేమ్ రాబట్టుకున్న ఆమె.. ఇటీవల 'అగధ' చిత్రంతో మెప్పించారు. ఇక గత కొద్దికాలంగా వరుస ఇంటర్వ్యూలో పాల్గొంటూ వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా, కామాక్షి టాలీవుడ్‌లో జరిగే కమిట్‌మెంట్ వ్యవహారాలపై షాకింగ్ విషయాలను పంచుకున్నారు. అన్ని ఇండస్ట్రీలలోనూ ఆఫర్ల నెపంతో వేధించే సంస్కృతి ఉందనేది నిరాకరించలేని నిజమని కామాక్షి చెప్పారు. అయితే అసలైన నిర్మాతల కంటే కూడా.. కేవలం చేతిలో డబ్బు ఉండి ఇండస్ట్రీలోకి వచ్చే కొందరు వ్యక్తులే నటీనటులను మోసం చేస్తుంటారని మండిపడ్డారు. సినిమా తీయడం ఒక కళ అని, కానీ కొందరు డబ్బు చూసుకుని హీరోయిన్లుగా మారాలనుకునే అమ్మాయిలను కమిట్‌మెంట్స్ పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ తరహా వేధింపులు కేవలం నటీమణులకే కాకుండా, డైరెక్టర్లు అవ్వాలనే కలలతో వచ్చే యువకులకు కూడా ఎదురవుతాయని వెల్లడించారు. తన కెరీర్ ప్రారంభంలో జరిగిన ఒక విచిత్రమైన సంఘటనను ఈ సందర్భంగా ఆమె గుర్తుచేసుకున్నారు. "నేను ఇండస్ట్రీకి కొత్తగా వచ్చినప్పుడు ఎవరైనా కమిట్‌మెంట్ అని అడిగితే.. నాకు పని పట్ల ఉన్న నిబద్ధత గురించి అడుగుతున్నారేమో అనుకునేదాన్ని. అందుకే నేను వర్క్ పట్ల చాలా కమిటెడ్‌గా ఉంటానని చెప్పేదాన్ని. కానీ ఆ మాట వెనుక ఉన్న అసలైన నీచమైన అర్థం తెలుసుకోవడానికి నాకు మూడేళ్లు పట్టింది" అని కామాక్షి స్పష్టం చేశారు.




# కల్కి 2 ఆఫర్ ఫేక్: వైజయంతీ మూవీస్

'కల్కి 2898 ఏడీ' సినిమా పేరుతో జరుగుతున్న నకిలీ కాస్టింగ్ కాల్స్‌పై చిత్రబృందం అప్రమత్తం చేసింది. తమ ప్రతినిధులమంటూ కొందరు వ్యక్తులు, సంస్థలు ఆడిషన్స్, కాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారని తెలిపింది. ఇలాంటి వారిని నమ్మొద్దని ప్రజలను కోరింది. ఈ మేరకు ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ గురువారం సోషల్ మీడియా ద్వారా కీలక ప్రకటన విడుదల చేసింది. తాము ఎలాంటి థర్డ్ పార్టీ ఏజెన్సీ, కంపెనీ, వ్యక్తి లేదా కాస్టింగ్ ప్రతినిధిని ఆడిషన్స్, కాస్టింగ్ కోసం నియమించలేదని స్పష్టం చేసింది. తమ పేరుతో ఎవరైనా కాస్టింగ్ అవకాశాలు కల్పిస్తామంటూ సంప్రదిస్తే వ్యక్తిగత వివరాలు, ఆడిషన్ మెటీరియల్ ఇవ్వొద్దని మేకర్స్ సూచించారు. ముఖ్యంగా ఎలాంటి చెల్లింపులు చేయవద్దని హెచ్చరించారు. తమ సంస్థ పేరును అనధికారికంగా ఉపయోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని స్పష్టం చేశారు. 'కల్కి 2898 ఏడీ'కు సంబంధించిన అధికారిక సమాచారం కోసం వైజయంతీ మూవీస్ అధికారిక సోషల్ మీడియా ఖాతాలను మాత్రమే నమ్మాలని చిత్రబృందం సూచించింది. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ తదితర అగ్ర తారలు నటించిన ఈ చిత్రానికి నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. భారీ విజయం సాధించిన తొలి భాగం 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో రెండు పురస్కారాలను దక్కించుకుంది. ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రంగా అవార్డు రావడంతో పాటు బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్ విభాగంలోనూ పురస్కారం లభించింది.



## రోహిత్ గొప్పగా ఆడుతున్నాడు: సైకియా

వచ్చే వన్డేప్రపంచకప్ -2027 ఆడాలనుకుంటున్న రోహిత్ శర్మ భవితవ్యంపై ఊగిసలాట కొనసాగుతోంది. ఇంగ్లండ్ పర్యటనలో విఫలమైన అతడిని తప్పించి యశస్వీ జైస్వాల్‌కు అవకాశమిస్తారనే వార్తలు వినిపిస్తున్న వేళ.. ఇప్పటికిప్పుడు ఆ ముప్పేమి లేదనిపిస్తోంది.

**గురువారం బీసీసీఐ సమీక్షా సమావేశం అనంతరం సెక్రటరీ దేవజిత్ సైకియా మాట్లాడుతూ హిట్‌మ్యాన్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మీరు చూసే ఉంటారు.**

రోహిత్ గొప్పగా ఆడుతున్నాడు అని సైకియా కామెంట్ చేశాడు. దాంతో.. ప్రస్తుతానికి వన్డే జట్టులో రోహిత్‌కు అవకాశముందనే విషయాన్ని చెప్పకనే చెప్పాడు బీసీసీఐ కార్యదర్శి. ఫామ్ పరంగా విమర్శలు ఎదుర్కొటున్న రోహిత్ శర్మకు మరో అవకాశం ఇవ్వాలని బీసీసీఐ భావిస్తోంది. వన్డేల్లో విధ్వంసక ఓపెనరైన హిట్‌మ్యాన్‌ను ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌లో ఆడించాలని భారత బోర్డు అనుకుంటోంది. అనభవజ్ఞుడైన రోహిత్‌ను వెస్టిండీస్ పర్యటనలో ఆడించాలని వినతులు వస్తున్న వేళ.. బీసీసీఐ అందుకు సానుకూలంగా ఉందనిపిస్తోంది. ఎందుకంటే.. తాజాగా సమీక్ష సమావేశం అనంతరం సెక్రటరీ దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. 'మీరూ చూసే ఉంటారు. రోహిత్ గొప్పగా ఆడుతున్నాడు. మీకు ఇంతకంటే ఏం కావాలి. చివరి మ్యాచ్‌లో రోహిత్ శతకం సాధించాడు. అలాంటప్పుడు ఎందుకీ ఊహాగానాలు. మీరు అడిగే అనవసర ప్రశ్నలకు నేను బదులివ్వను' అని మీడియాతో అన్నాడుఅతడి మాటలను బట్టి.. స్వదేశంలో విండీస్‌తో వన్డే సిరీస్ స్క్వాడ్‌లో రోహిత్ ఉండడం ఖాయమనిపిస్తోంది. వన్డే ప్రపంచకప్‌లో యశస్వీ జైస్వాల్‌కు అవకాశం ఇవ్వాలని చీఫ్ సెలెక్టర్ అగార్కర్, కోచ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అభిప్రాయం వ్యక్తం చేయగా.. తాత్కాలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్, టీ20 సారథి శ్రేయాస్ అయ్యర్‌లు మాత్రం రోహిత్ ఉండాల్సిందేనని పట్టుపట్టారని సమాచారం. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో సిరీస్ మొదలవ్వనుంది. ఆపై టీమిండియాతో ఐదు టీ20 సిరీస్ ఆడనుంది కరీబియన్ టీమ్.



## కిదాంబి శ్రీకాంత్ అదుర్స్

చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. రెండో రౌండ్‌లో అతను సంచలన విజయం సాధించాడు. గురువారం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నం.9 ప్లేయర్, కెనడాకు చెందిన విక్టర్ లాయ్‌కు షాకిచ్చాడు. వరుసగా రెండు గేముల్లో 21-18, 21-19 తేడాతో విజయం సాధించాడు. 43 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి నుంచి శ్రీకాంత్ గట్టిపోటీనే ఎదుర్కొన్నాడు. కానీ ఏ మాత్రం పట్టుదల కోల్పోలేదు. తొలి గేములో ఒక దశలో 15-11తో వెనుకంజలో ఉన్నాడు. ఈ స్థితిలో బలంగా పుంజుకున్న అతను ప్రత్యర్థికి చెక్ పెట్టి తొలి గేము నెగ్గాడు. ఇక రెండో గేములో కూడా శ్రీకాంత్ పోరాట పటిమ కనబరిచాడు. విక్టర్ లాయ్ సవాల్ విసిరి 18-18తో స్కోరు సమం చేయడంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది. కానీ, శ్రీకాంత్ వరుసగా మూడు పాయింట్లు సాధించి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి జోడీ కూడా క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. రెండో రౌండ్‌లో సాత్విక్ జోడీ 21-17, 22-24, 21-9 తేడాతో ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పొపొవ్-టోమా జూనియర్ పొపొవ్ ద్వయాన్ని ఓడించింది. గంటాకుపైగా సాగిన మ్యాచ్‌లో తొలి రెండు గేముల్లో సాత్విక్ జోడీ, ఫ్రాన్స్ జంట పోటీపోటీగా తలపడ్డాయి. చెరో గేము నెగ్గాయి. ఇక నిర్ణయాత్మక మూడో గేములో మాత్రం సాత్విక్, చిరాగ్‌లదే హవా. యువ క్రీడాకారిణి తన్వి శర్మ రెండో రౌండ్‌లో ఇంటిదారిపట్టింది. జపాన్‌కు చెందిన టోమోకా మియాజాకితో తలపడిన తన్వి 17-21, 21-18, 16-21 తేడాతో పోరాడి ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో ద్వయం రెండో రౌండ్‌లో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.



# మంధాన మెరుపు సెంచరీ



## హాంకాంగ్ చైనాపై భారత్ విన్

**మహిళల ఆసియా కప్‌లో వరసగా రెండో విజయంతో భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఓపెనర్ స్మృతి మంధాన(124) రికార్డు శతకం బాదేయగా.. దీప్తి శర్మ(3-9), శ్రీ చరణి(2-16)లు తిప్పేయగా హాంకాంగ్ చైనాను చిత్తు చేసింది టీమిండియా.**



హర్మన్‌ప్రీత్ సేన నిర్దేశించిన 194 పరుగుల ఛేదనలో ఆది నుంచి తడబడిన.. హాంకాంగ్ చైనా.. చివరకు 56 రన్స్‌కే కుప్పకూలింది. 137 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్ సెమీస్ బెర్తును పట్టేసింది. ఆసియా కప్‌లో జోరు మీదున్న భారత జట్టు వరసగా రెండో విజయంతో గర్జించింది.

థాయ్‌లాండ్‌పై కాస్త తడబడినట్టు అనిపించినా ఈసారి టాప్ షోతో హాంకాంగ్ చైనాను బెంబేలెత్తించింది టీమిండియా. ఆకాశమే హద్దుగా చెలరేగిన ఓపెనర్ స్మృతి మంధాన(124: 64 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లు) రికార్డు శతకంతో బౌలర్లను హడలెత్తించింది. ఆపై స్పిన్ ద్వయం దీప్తి శర్మ(3-9), శ్రీ చరణి(2-16)లు తిప్పేశారు. వీరి స్పిన్ ధాటికి ప్రత్యర్థి బ్యాటర్లు ఇలా వచ్చి అలా వెళ్లారు. ఫలితంగా హాంకాంగ్ చైనా 56 పరుగులకే ఆలౌటైంది. అనుకున్నట్టే భారీ విజయంతో సెమీస్‌కు అర్హత సాధించింది టీమిండియా. నాకౌట్‌కు దూసుకెళ్లిన మొదటి జట్టు భారతే కావడం విశేషం. టాస్ ఓడిన భారత జట్టుకు షఫాలీ వర్మ(28)తో కలిసి శుభారంభమిచ్చింది స్మృతి మంధాన(124 64 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లు). వీరిద్దరూ ఎడాపెడా బౌండరీలు బాదగా.. స్కోర్ బోర్డు పరుగులు తీసింది. దంచేస్తున్న షఫాలీని ఔట్ చేయగా.. 10 ఓవర్లలో వికెట్ నష్టానికి 85 పరుగులు చేసింది టీమిండియా. దాంతో.. రెండొందలకుపైగా స్కోర్ ఖాయమనుకున్న వేళ ప్రతీకా రావల్(10), రీచా ఘోష్ (11), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(10)లు.. మరోసారి నిరాశపరిచారు. క్రీజులో నిలిచి సహకరించేవాళ్లు కరువైన మంధాన తన దూకుడు ఆపలేదు. కెరీర్లో రెండో టీ20 సెంచరీతో జట్టుకు కొండంత స్కోరందించింది. ఈ క్రమంలోనే మంధాన అంతర్జాతీయంగా మహిళల క్రికెట్‌లో అత్యధిక పరుగులతో చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం ఆమె పేరిట10,869 పరుగులు ఉన్నాయి. మెరుపుల ఫలితంగా నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 193 పరుగులతో హాంకాంగ్ చైనాను భయపెట్టింది టీమిండియా.

## అగార్కర్‌పై వేటు..?



టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవిపై వస్తున్న ఊహాగానాలకు బీసీసీఐ తెరదించింది. గురువారం జరిగిన కీలక సమీక్ష సమావేశానికి అగార్కర్ హాజరుకాకపోవడంతో.. ఆయన పదవీకాలంపై పలు రకాల వార్తలు వచ్చాయి. ఈ సమావేశానికి టెస్టులు, వన్డేలకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20లకు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ హాజరయ్యారు. బీసీసీఐ ఉన్నతాధికారులతో పాటు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రికెట్ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. అయితే అగార్కర్ మాత్రం ప్రత్యక్షంగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో అగార్కర్ పదవీకాలం కొనసాగుతుందా? ఆయనకు పొడిగింపు ఇస్తారా? అన్న చర్చ మొదలైంది. అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా ఉన్న సమయంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు తీవ్ర చర్చకు దారితీశాయి. టీ20 కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్‌కు దీర్ఘకాలిక మద్దతు ఇవ్వడం అందులో ఒకటి. హార్దిక్ పాండ్యాకు బదులుగా సూర్యకుమార్‌ను ఎంపిక చేయడంపై విమర్శలు వచ్చాయి. అలాగే విజయవంతమైన కెప్టెన్ రోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించడం కూడా సున్నితమైన నిర్ణయంగా మారింది. అయితే ఈ నిర్ణయాల విషయంలో అగార్కర్ వెనక్కి తగ్గలేదు. విమర్శలను ఎదుర్కొంటూ తన నిర్ణయాలను సమర్థించుకున్నారు. సెలెక్టర్ పని కేవలం గణాంకాలు చూసి జట్టును ఎంపిక చేయడం కాదని.. ప్రజాదరణ ఆధారంగా ప్రతి నిర్ణయం తీసుకోలేమనే విషయాన్ని అగార్కర్ తన పదవీకాలంలో చూపించారని విశ్లేషణలు చెబుతున్నాయి. కీలక నిర్ణయాలపై విమర్శలు వచ్చినా.. వాటిని ఎదుర్కొంటూ ముందుకు సాగడం ఆయన పదవీకాలంలో ప్రత్యేకంగా కనిపించింది.

## ఆసియా క్రీడలకు కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్



ఆసియా క్రీడలు సమీపిస్తున్న వేళ భారత క్రికెట్ నియంత్రణ మండలి సంచలన నిర్ణయం తీసుకోనుంది. జపాన్ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో ఆడే భారత జట్టుకు కోచ్, సహాయక సిబ్బందిని ఖరారు చేయనుంది బీసీసీఐ. ఊహించినట్టే హెడ్‌కోచ్ గౌతం గంభీర్ స్థానంలో.. వీవీఎస్ లక్ష్మణ్ ఎంపికయ్యే అవకాశముంది. ఆసియా క్రీడల్లో శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని యువ భారత్‌కు లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరిస్తాడని సమాచారం. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో సిరీస్ ఓటమిపై సమీక్షా సమావేశం సందర్భంగా బీసీసీఐ కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు సమాచారం. ఆసియా క్రీడలకు లక్ష్మణ్‌ను కోచ్‌గా పంపాలని బీసీసీఐ అనుకుంటోందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అలానే సహాయక సిబ్బందిగా కొందరిని ఎంపిక చేసినట్టు టాక్. అయితే.. భారత బోర్డు మాత్రం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. శ్రీలంక పర్యటనలో టెస్టు సిరీస్ సమం చేసిన భారత్ మరో మెగా ఈవెంట్‌కు సిద్ధమవుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆసియా క్రీడల్లో బరిలోకి దిగనంది టీమిండియా. అయితే.. హెడ్‌కోచ్ గౌతం గంభీర్ మాత్రం జట్టుతో వెళ్లడం లేదు. జింబాబ్వే పర్యటనలో విజయవంతమైన తాత్కాలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్‌నే ఈ మెగా టోర్నీకి పంపాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి భావిస్తోంది.

## శ్రీలంకకు 188కోట్ల నష్టం

శ్రీలంక క్రికెట్‌కు ఐసీసీ భారీ షాక్ ఇచ్చింది. తొలిసారిగా నిర్వహించనున్న మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ-2027 ఆతిథ్య హక్కులను శ్రీలంక నుంచి వెనక్కి తీసుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌ను భారత్‌కు కేటాయిస్తున్నట్లు ఐసీసీ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో శ్రీలంక సుమారు 20 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 188కోట్లు) ఆదాయాన్ని కోల్పోనుంది. శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) పాలనా వ్యవహారాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ జోక్యమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణం. ఐసీసీ నిబంధనల ప్రకారం, క్రికెట్ బోర్డుకు ఎన్నికైన పాలకవర్గం ఉండాలి. కానీ, శ్రీలంకలో ప్రస్తుతం ప్రభుత్వంచే నియమించబడిన 'ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ' బోర్డు వ్యవహారాలను పర్యవేక్షిస్తోంది. దీనిపై ఐసీసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆతిథ్య హక్కులను భారత్‌కు బదిలీ చేసింది. ఈ టోర్నమెంట్ 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ముంబై, వడోదర వేదికలుగా జరగనుంది. 'శ్రీలంక డైలీ మిర్రర్' కథనం ప్రకారం.. రాజకీయ జోక్యాన్ని పరిష్కరించుకుని, బోర్డు ఎన్నికలు నిర్వహించకపోతే ఆతిథ్య హక్కులను కోల్పోతారని ఐసీసీ కొన్ని నెలల క్రితమే శ్రీలంక క్రికెట్‌కు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. అయితే, ఈ విషయాన్ని మధ్యంతర కమిటీ.. అక్కడి క్రీడా మంత్రిత్వ శాఖ లేదా అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే దృష్టికి తీసుకెళ్లలేదని పేర్కొంది. ఈ నిర్ణయం వల్ల పర్యాటకం, కార్యకలాపాల ద్వారా లభించే సుమారు 20 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని శ్రీలంక కోల్పోనుందని అంచనా.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# బర్తరఫ్ వేటు.. కాంగ్రెస్‌కే ముప్పు!

కొండా సురేఖపై బర్తరఫ్ వేటు.. ఇప్పుడు ఒక మంత్రి భవితవ్యానికి సంబంధించిన అంశంగా మాత్రమే చూడలేం. ఇది తెలంగాణ కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే పరిణామంగా మారుతోంది. ఒక నాయకురాలిపై చర్య తీసుకోవడం ద్వారా సమస్య పరిష్కారమవుతుందా? లేక కొత్త సమస్యలకు తలుపులు తెరుచుకుంటాయా? అన్నది కాంగ్రెస్ నాయకత్వం ఆలోచించాల్సిన కీలక ప్రశ్న. కొండా సురేఖ రాజకీయ ప్రయాణం సాధారణమైనది కాదు. తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాయకురాలు ఆమె. ప్రజా ఉద్యమాల నేపథ్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చి, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని తన రాజకీయ ఉనికిని నిలబెట్టుకున్నారు. అలాంటి నాయకురాలిపై బర్తరఫ్ వేటు వేయడం అంటే కేవలం ఒక మంత్రి పదవిని తొలగించడం కాదు.. పార్టీతో ఆమెకు ఉన్న రాజకీయ సంబంధాలపై కూడా ప్రభావం చూపే నిర్ణయం అవుతుంది. కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీకి అంతర్గత భిన్నాభిప్రాయాలు కొత్తేమీ కాదు. కానీ వాటిని చర్చల ద్వారా పరిష్కరించాల్సిన చోట క్రమశిక్షణ పేరుతో కఠిన చర్యలకు దిగితే అసలు సమస్య మరింత పెద్దదవుతుంది. నాయకత్వాన్ని ప్రశ్నించిన ప్రతి స్వరాన్ని అణచివేయడం పార్టీ బలానికి సంకేతం కాదు.. బలహీనతకు సంకేతం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లకు పైగా గడిచింది. అధికారాన్ని నిలబెట్టుకోవడం ఎంత ముఖ్యమో, పార్టీలోని వివిధ వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్లడం కూడా అంతే ముఖ్యం. ఇప్పటికే పార్టీలో అంతర్గత అసంతృప్తి, నాయకుల మధ్య విభేదాలు, పదవులు-ప్రాధాన్యతలపై పోటీ వంటి అంశాలు తరచూ చర్చకు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మరో కీలక నాయకురాలిపై వేటు వేయడం పార్టీ అంతర్గత సమీకరణాలను మరింత అస్థిరం చేసే ప్రమాదం ఉంది. ఇక్కడ ఒక విషయాన్ని కాంగ్రెస్ నాయకత్వం గుర్తుంచుకోవాలి. పార్టీ వ్యక్తుల కంటే పెద్దది. కానీ వ్యక్తులను అవమానించే స్థాయికి పార్టీ నిర్ణయాలు వెళితే.. చివరికి పార్టీ ప్రతిష్ఠకే నష్టం. క్రమశిక్షణ అవసరమే. కానీ క్రమశిక్షణకు, అసమ్మతిని అణచివేయడానికి మధ్య చాలా తేడా ఉంది. కొండా సురేఖపై చర్య తీసుకోవడం వల్ల ఆమెకు రాజకీయంగా నష్టం జరుగుతుందా అన్నది ఒక ప్రశ్న. కానీ దానికంటే పెద్ద ప్రశ్న.. దాని వల్ల కాంగ్రెస్‌కు రాజకీయంగా లాభమా? అన్నది. ఒకవేళ ఆమెపై చర్య పార్టీ అంతర్గత అసంతృప్తిని మరింత పెంచితే, ప్రతిపక్షాలకు కొత్త రాజకీయ ఆయుధం లభిస్తుంది. ముఖ్యంగా తెలంగాణలో అధికార పార్టీగా కాంగ్రెస్ ప్రతి అడుగును ప్రజలు, ప్రతిపక్షాలు నిశితంగా గమనిస్తున్న సమయంలో ఇలాంటి నిర్ణయాలు రాజకీయంగా తీవ్ర ప్రభావం చూపవచ్చు. కాంగ్రెస్ చరిత్రలో ఎన్నో సంక్షోభాలు వచ్చాయి. నాయకులు వెళ్లిపోయారు. వర్గాలు ఏర్పడ్డాయి. తిరిగి కలిశాయి. కానీ పార్టీ నిలబడింది. ఎందుకంటే కాంగ్రెస్‌కు ఉన్న అతిపెద్ద బలం విభిన్న అభిప్రాయాలను తనలో ఇముడ్చుకునే రాజకీయ సంస్కృతి. ఆ సంస్కృతి బలహీనపడితేనే అసలు ప్రమాదం. ఇప్పటి తెలంగాణ కాంగ్రెస్‌కు కావాల్సింది బర్తరఫ్‌లు కాదు.. సమన్వయం. నోటీసులు కాదు.. చర్చలు. శిక్షలు కాదు.. సమాధానాలు. నాయకుల మధ్య గోడలు కాదు.. సమన్వయ వేదికలు. ఒక మంత్రి చేసిన వ్యాఖ్యలు పార్టీకి ఇబ్బంది కలిగించాయనుకుంటే, పార్టీ తన అభ్యంతరాన్ని స్పష్టంగా చెప్పవచ్చు. వివరణ కోరవచ్చు. క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చు. కానీ చివరి అస్త్రంగా బర్తరఫ్‌ను ప్రయోగించే ముందు దాని రాజకీయ పరిణామాలను అంచనా వేయాలి. ఎందుకంటే రాజకీయాల్లో ఒకరిని తొలగించడం సులభం.. కానీ దాని వల్ల ఏర్పడిన రాజకీయ శూన్యతను పూడ్చడం అంత సులభం కాదు. ప్రత్యేకించి మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పే పార్టీ.. ఒక మహిళా మంత్రిపై తీసుకునే చర్య విషయంలో మరింత పారదర్శకత, సమన్యాయం, రాజకీయ పరిపక్వత ప్రదర్శించి ఉండాల్సింది.



# కృష్ణ తత్వమే నేటి దారిదీపం

శ్రీకృష్ణ జన్మాష్టమి వచ్చిందంటే చాలు.. ఇళ్లలో వేడుకలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉట్ల పండుగలు, భక్తి గీతాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. కానీ శ్రీకృష్ణుడిని కేవలం పూజించే దేవుడిగా చూస్తే ఆయన ఇచ్చిన మహత్తర సందేశాన్ని మనం సగమే అర్థం చేసుకున్నట్లవుతుంది. కృష్ణతత్వం ఒక జీవన మార్గం. నేటి సంక్లిష్ట సమాజానికి అవసరమైన ధైర్యం, వివేకం, కర్తవ్యనిష్ఠ, సమతుల్యతకు అది దారిచూపే దీపస్తంభం.

కంసుడి నిరంకుశత్వం నుంచి కురుక్షేత్రంలోని ధర్మసంకటాల వరకు శ్రీకృష్ణుడి జీవితం మనకు ఒక గొప్ప సత్యాన్ని చెబుతుంది. అన్యాయం పెరుగుతున్నప్పుడు మౌనం కూడా ఒక తప్పిదమే. అధర్మాన్ని ఎదుర్కొనేందుకు ధైర్యం కావాలి. అయితే ఆ ధైర్యానికి వివేకం తోడవ్వాలి. నేటి సమాజంలో అసత్య ప్రచారం, ద్వేషపూరిత మాటలు, సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాపించే తప్పుడు సమాచారం, అవినీతి, అధికార దుర్వినియోగం, వివక్ష వంటి సమస్యలు పెరుగుతున్న వేళ కృష్ణుడి వివేకం మనకు ఎంతో అవసరం. కురుక్షేత్రంలో అర్జునుడు అయోమయంలో నిలిచిపోయినప్పుడు శ్రీకృష్ణుడు అతనికి ఇచ్చిన గీతా సందేశం నేటి యువతకు కూడా అంతే ప్రాసంగికం. ఫలితం గురించి భయపడకుండా కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించాలి అన్న ఆలోచన, పోటీ ప్రపంచంలో ఒత్తిడికి గురవుతున్న ప్రతి వ్యక్తికి ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. విజయం వచ్చినప్పుడు పొంగిపోక, అపజయం ఎదురైనప్పుడు కుంగిపోక సమచిత్తంతో ముందుకు సాగడం కృష్ణతత్వంలోని గొప్ప జీవన సూత్రం. కృష్ణుడు కేవలం యుద్ధరంగంలోనే కాదు.. సంబంధాల్లోనూ మనకు ఆదర్శం. స్నేహానికి విలువనిచ్చిన కృష్ణుడు-కుచేలుల బంధం, సామాజిక స్థాయిలకు అతీతంగా మనిషిని మనిషిగా గౌరవించాలనే సందేశాన్ని ఇస్తుంది. నేడు ఆర్థిక అసమానతలు, కుల-మత విభేదాలు, సామాజిక దూరాలు పెరుగుతున్న సమయంలో ఈ మానవీయత మరింత అవసరం.

కృష్ణుడి వేణుగానం మనకు మరో సందేశాన్ని అందిస్తుంది. జీవితం కేవలం సంపాదన, అధికారం, పోటీ కాదు; ఆనందం, ప్రేమ, అనుబంధం కూడా అవసరమే. సాంకేతికత మన చేతుల్లో ప్రపంచాన్ని పెట్టినా.. మనసులను మాత్రం దూరం చేస్తున్న కాలంలో ఈ సందేశాన్ని మరచిపోకూడదు. పిల్లలకు సమయం కేటాయించడం, పెద్దలను గౌరవించడం, ప్రకృతిని ప్రేమించడం, తోటి మనిషి కష్టాన్ని అర్థం చేసుకోవడం కూడా నిజమైన ఆధ్యాత్మికతే. నేటి రాజకీయ, సామాజిక జీవితంలోనూ కృష్ణతత్వం ఒక విలువైన పాఠం చెబుతుంది.. అధికారం ప్రజల కోసం ఉండాలి; ప్రజలు అధికారం కోసం కాదు. పాలకుడికి కృష్ణుడి వ్యూహబుద్ధి మాత్రమే కాదు, ధర్మబద్ధత కూడా అవసరం. ప్రజలకు ప్రశ్నించే ధైర్యం, నిజాన్ని గుర్తించే వివేకం అవసరం. జన్మాష్టమి రోజున కృష్ణుడి విగ్రహానికి పూలు సమర్పించడం ఎంత ముఖ్యమో.. ఆయన బోధించిన విలువలను మన జీవితాల్లో ఆచరించడం అంతకంటే ముఖ్యం. మనలోని కంసత్వం.. అహంకారం, ద్వేషం, అసూయ, స్వార్థం, క్రూరత్వం నశించినప్పుడే నిజమైన కృష్ణజన్మ జరుగుతుంది. మనలోని ధర్మబుద్ధి మేల్కొన్నప్పుడే జన్మాష్టమి సార్థకమవుతుంది. కృష్ణుడు పుట్టింది ద్వాపరయుగంలో కావచ్చు.. కానీ కృష్ణతత్వం ప్రతి యుగానికీ అవసరమే. అధర్మం ఉన్నంతకాలం ధర్మం కోసం నిలబడే కృష్ణుడు కావాలి. అయోమయం ఉన్నంతకాలం దారి చూపే కృష్ణవాక్కు కావాలి. ద్వేషం ఉన్నంతకాలం ప్రేమను పంచే కృష్ణహృదయం కావాలి. ఈ జన్మాష్టమి మన ఇళ్లలో పండుగను మాత్రమే కాదు.. మన హృదయాల్లో ధర్మాన్ని, మన ఆలోచనల్లో వివేకాన్ని, మన చేతల్లో కర్తవ్యాన్ని, మన సమాజంలో మానవత్వాన్ని జన్మింపజేయాలి. అదే శ్రీకృష్ణుడికి మనం సమర్పించగల నిజమైన నివాళి.



**రామ్ మనోహర్ శర్మ**
**బండపెల్లి,**
**ఆధ్యాత్మిక పండితుడు**
**91 81061 94150**

# యుద్ధాలను మోస్తున్న సామాన్యుడు

యుద్ధం ఎక్కడో జరుగుతుంది.. బాంబులు ఎక్కడో పడతాయి.. సైనికులు ఎక్కడో ప్రాణాలు కోల్పోతారు. కానీ యుద్ధం ముగిసేలోపే దాని భారాన్ని మోసేది మాత్రం ప్రపంచంలోని సామాన్యుడే. అతని ఇంటి వంటగదిలో, మార్కెట్ సంచిలో, నెలాఖరు జీతంలో, పిల్లల పాఠశాల ఫీజులో, కుటుంబ బడ్జెట్‌లో యుద్ధం తన ముద్ర వేస్తుంది. ప్రపంచంలోని ఏ మూలన యుద్ధం మొదలైనా దాని ప్రకంపనలు సరిహద్దులు దాటి వస్తున్నాయి. ఇంధన ధరలు కదులుతాయి. రవాణా ఖర్చులు పెరుగుతాయి. ముడిసరుకుల సరఫరా దెబ్బతింటుంది. ఆహార పదార్థాల ధరలు ఎగబాకుతాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. చివరికి ఆ భారం అంతా వినియోగదారుడి మీద పడుతుంది.




అంటే.. యుద్ధం చేసే వారు కొందరైతే, దాని మూల్యం చెల్లించేది కోట్లాది మంది. నెల మొదట్లో వచ్చిన జీతం ఒకప్పుడు నెలాఖరు వరకు సరిపోయేది. ఇప్పుడు నెల మొదటి వారానికే లెక్కలు మొదలవుతున్నాయి. కూరగాయలు, పప్పులు, నూనె, పాలు, గ్యాస్, విద్యుత్, రవాణా.. ఒక్కో ఖర్చు కుటుంబ బడ్జెట్‌ను కొద్దికొద్దిగా కొరుకుతోంది. పిల్లల చదువు, వైద్యం, అద్దె, ఇంటి రుణ వాయిదాలు, బీమా.. ఇవన్నీ చెల్లించిన తర్వాత మిగిలేది జీవించడానికి సరిపోతుందా అన్నదే ప్రశ్నగా మారుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది.

పేదలకు కొన్ని సంక్షేమ పథకాలు అందుతాయి. సంపన్నులకు ధరల పెరుగుదల పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు. కానీ మధ్యతరగతి మాత్రం ఈ రెండింటి మధ్య ఇరుక్కుపోయింది. ఆదాయం పరిమితమే.. అవసరాలు మాత్రం అపరిమితం. సబ్సిడీలకు అర్హత ఉండదు. అదే సమయంలో పెరుగుతున్న ఖర్చులను తట్టుకునేంత ఆదాయం ఉండదు. ఫలితంగా పొదుపులు తగ్గుతున్నాయి.. అప్పులు పెరుగుతున్నాయి.. భవిష్యత్తుపై భయం పెరుగుతోంది. ఒకప్పుడు సొంత ఇల్లు, మంచి విద్య, కుటుంబంతో ప్రశాంతమైన జీవితం, పదవీ విరమణ తర్వాత భద్రత.. ఇవే మధ్యతరగతి కలలు. ఇప్పుడు ఆ కలల స్థానంలో ఈ నెల ఖర్చులు ఎలా నెట్టుకురావాలి? పిల్లల ఫీజు ఎలా చెల్లించాలి? రుణ వాయిదా ఎలా కట్టాలి? వైద్య ఖర్చు వస్తే ఏం చేయాలి? అన్న ఆందోళనలు చోటుచేసుకుంటున్నాయి. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు. ఇది సామాజిక సమస్య కూడా. ధరలు పెరిగినప్పుడు ముందుగా తగ్గేది విలాసం కాదు.. కుటుంబ అవసరాల్లోని చిన్నచిన్న ఆనందాలు. బయట భోజనం మానేస్తారు. పిల్లల కోరికలు వాయిదా వేస్తారు. కొత్త దుస్తులు కొనడం తగ్గిస్తారు. ప్రయాణాలు రద్దవుతాయి. చివరికి కుటుంబ సభ్యుల మధ్య కూడా ఆర్థిక ఒత్తిడి పెరుగుతుంది. ద్రవ్యోల్బణం కేవలం ధరలను పెంచదు.. మనుషుల ప్రశాంతతను కూడా తగ్గిస్తుంది. అయితే ప్రపంచం మాత్రం యుద్ధాల గురించి మాట్లాడుతూనే ఉంది. ఆయుధాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. రక్షణ బడ్జెట్లు పెరుగుతున్నాయి. క్షిపణులు, డ్రోన్లు, యుద్ధ విమానాల సామర్థ్యాలపై చర్చలు జరుగుతున్నాయి. కానీ ఒక ప్రశ్న మాత్రం తరచుగా వెనుకబడిపోతోంది---ఈ యుద్ధాల మధ్య ఒక సాధారణ కుటుంబం ఎలా బతుకుతోంది? యుద్ధంలో విజేత ఎవరు అన్నది చరిత్ర చెబుతుంది. ఓడిపోయిన దేశం గురించి కూడా చరిత్ర రాస్తుంది. కానీ యుద్ధం కారణంగా తన పొదుపు మొత్తం ఖర్చు చేసిన కుటుంబం గురించి ఎవరు రాస్తారు? ఉద్యోగం కోల్పోయిన కార్మికుడి గురించి ఎవరు మాట్లాడతారు? పెరిగిన ఫీజుల కోసం అప్పు చేసిన తల్లిదండ్రుల బాధను ఎవరు లెక్కిస్తారు? ధరల పెరుగుదలతో తన చిన్న వ్యాపారం మూసివేసిన వ్యక్తి నష్టాన్ని ఎవరు కొలుస్తారు?

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సామాన్యుడు ఒక సంఖ్య కావచ్చు.. కానీ అతని ఇంట్లో ప్రతి రూపాయికి ఒక కథ ఉంటుంది. అందుకే యుద్ధాలను అంచనా వేసేటప్పుడు కేవలం సైనిక విజయాలు, భౌగోళిక ఆధిపత్యాలు, రాజకీయ ప్రయోజనాలనే కాకుండా మానవ జీవితాలపై వాటి ప్రభావాన్ని కూడా కొలవాలి. శాంతి అంటే కేవలం తుపాకులు మౌనంగా ఉండటం కాదు. ఒక కుటుంబం భయపడకుండా భవిష్యత్తు కోసం పొదుపు చేసుకోగలగడం కూడా శాంతే. ఒక తల్లి పిల్లల చదువు గురించి ఆందోళన చెందకుండా ఉండటం శాంతే. ఒక కార్మికుడు రేపటి ఉద్యోగం గురించి భయపడకుండా ఇంటికి వెళ్లగలగడం శాంతే. ప్రపంచ నాయకులు యుద్ధాలపై నిర్ణయాలు తీసుకునే ముందు ఈ సామాన్యుడి ముఖాన్ని చూడాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే సరిహద్దుల్లో సైనికులు యుద్ధం చేస్తారు.. కానీ ఆర్థిక రంగంలో సామాన్యుడు ప్రతిరోజూ ఆ యుద్ధాన్ని మోస్తున్నాడు. ఒకవైపు భౌగోళిక యుద్ధాలు.. మరోవైపు ధరల యుద్ధం. ఒకవైపు ఆయుధాల పోటీ.. మరోవైపు బతుకు కోసం పోటీ. ఒకవైపు దేశాల భద్రత.. మరోవైపు కుటుంబాల ఆర్థిక భద్రత. ఈ రెండింటి మధ్య సామాన్యుడి జీవితం నలిగిపోకూడదు. ప్రపంచానికి ఇప్పుడు మరిన్ని ఆయుధాల కంటే మరింత సంయమనం అవసరం. మరిన్ని యుద్ధాల కంటే మరింత దౌత్యం అవసరం. మరింత విధ్వంసం కంటే మరింత మానవత్వం అవసరం. ఎందుకంటే యుద్ధం ముగిసిన రోజున కూడా దాని గాయాలు మిగులుతాయి. ధరలు వెంటనే తగ్గవు. అప్పులు వెంటనే తీరవు. కోల్పోయిన ఉద్యోగాలు వెంటనే తిరిగి రావు. పాడైన ఆర్థిక వ్యవస్థ వెంటనే కోలుకోదు. కానీ ఈ భారాన్ని మోయాల్సింది మాత్రం అదే సామాన్యుడు.

అందుకే నేటి ప్రపంచానికి అసలైన విజయం శత్రువును ఓడించడంలో కాదు.. సామాన్యుడి బతుకును గెలిపించడంలో ఉంది. యుద్ధాలను ఆపితేనే ధరల ఒత్తిడికి కొంత ఉపశమనం. శాంతిని కాపాడితేనే ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం. సామాన్యుడి జీవితం నిలబడితేనే అభివృద్ధికి అర్థం. దేశాల మధ్య సరిహద్దులు ఉండొచ్చు.. కానీ సామాన్యుడి కన్నీటికి సరిహద్దులు ఉండవు. ఆ కన్నీటిని ఆపే ప్రపంచమే నిజమైన అభివృద్ధి చెందిన ప్రపంచం.



**చింత రామస్వామి**
**అచ్చంపేట-మహబూబ్‌నగర్**

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.